
సమీక్షలో పాల్గొన్న ఎస్పీ కిశోర్, కలెక్టర్ వెట్రిసెల్వి

జిల్లాలో ఆదాయ వనరులపై దృష్టి సారిస్తాం

కలెక్టర్ల సదస్సులో వెట్రిసెల్వి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆదాయవనరులపై మరింత దృష్టి పెడతాం.. పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక చర్యలు చేపట్టామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సీఎం చంద్రబాబు నాయుడుకు వివరించారు. కలెక్టర్ల సదస్సులో రెండోరోజు స్వచ్ఛ భారత్, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర, పరిశ్రమల స్థాపన, కాలుష్య నియంత్రణతో పాటు శాంతిభద్రతలపై సమీక్షించారు. ప్రధానంగా పీ-4 కార్యక్రమం విజయవంతం చేయడానికి తీసుకుంటున్నట్లు వెట్రిసెల్వి వివరించారు. కలెక్టరేట్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులు తమ కార్యాలయం నుంచే అమలు చేసేవిధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏలూరు జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా రూపొందించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులను రీ సైక్లింగ్ చేయడానికి ప్లాస్టిక్ స్లటర్ యంత్రాలను నియోజకవర్గానికి ఒక యూనిట్‌ను అందించాలన్నారు. అటువంటి యూనిట్లను ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలను ఇవ్వాలని కలెక్టర్ కోరారు. కొబ్బరి వ్యర్థాల పునర్వినియోగం యూనిట్ల ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లాలో మైనింగ్ ఆదాయంలో వెనకబడి ఉండడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. జీఎస్టీ వసూళ్లతోపాటు ప్రభుత్వ వచ్చే ఆదాయ వనరులపై తరచూ సమీక్షలు నిర్వహించాలని సీఎం సూచించారు. జిల్లాలో అటవీశాఖపరంగా మరింత గ్రీనరీ పెంచాల్సిన అంశంపైన సీఎం దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి జిల్లాలో ఏడు శాతం గ్రీనరీ పెంచడానికి తీసుకోవాల్సిన అన్ని అంశాలపై అధికారులతో సమీక్షించి తగు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వితో జిల్లా ఎస్పీ కె ప్రతాప్ కిశోర్ పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ రాక

పోణంగి డంపింగ్‌యార్డు సందర్శన

ఏలూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునిసి పాల్టీలు, కార్పొరేషన్లలో చెత్త నిల్వలను అక్టోబరు 2 నాటికి పూర్తిగా నిర్మూలించాలనేది ప్రభుత్వ లక్ష్యం. మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఏలూరు పోణంగిలోని డంపింగ్‌యార్డును మంగళవారం సందర్శించనున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందింది. కలెక్టర్ల సదస్సులో చెత్త నిల్వల నిర్మూలనపై మంగళవారం చర్చించారు. మంత్రి నారాయణ ఏలూరు రాక ప్రాధాన్యత సంతరించుకుంది.

పశుసంవర్ధశాఖ జేడీగా ప్రసాదరావు

ఏలూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ బి.ప్రసాదరావు పదోన్నతిపై నియమితులయ్యారు. ఆయన విశాఖపట్నంలో పశుసంవర్ధశాక డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఏలూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గోవిందరాజులు ఇన్‌చార్జి జేడీగా సంవత్సరం నుంచి కొనసాగుతున్నారు. త్వరలో ప్రసాదరావు బాధ్యతలను స్వీకరించనున్నారు.

పుష్కలంగా ఎరువులు

వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా

కామవరపుకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పుష్కలంగా ఎరువులు ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులులేవని జిల్లా వ్యవసాయ శాఖాధి కారి షేక్ హబీబ్ బాషా తెలిపారు. సొసైటీలు, ప్రైవేటు డీలర్ల షాపుల రికార్డులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీల వద్ద 20 వేల టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 90 వేల టన్నుల ఎరువులు ఉన్నాయన్నారు. యూరియా అందుబాటులో ఉందని అమ్మోనియం సల్ఫేట్ 196.000 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని చెప్పారు. వరి సాగులో యూరియా అధికంగా వాడడం వలన ప్రస్తుత వాతావరణంలో తెగుళ్ల సోకే అవకాశం ఉందన్నారు. మోతాదు మేరకు మాత్రమే ఎరు వులు వాడాలని చెప్పారు. పామాయిల్ పంటకు రైతులు అమ్మోనియం సల్ఫేట్ వినియోగించాలని తెలిపారు. ఆయన వెంట ఏవో డి.ముత్యాలరావు ఉన్నారు.

మహిళల ఆరోగ్యానికి జై

మహిళల ఆరోగ్య పరిరక్షణకు
'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'

నేటి నుంచి 2 వరకు వైద్య శిబిరాలు

కొత్త ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం.. ఏలూరులో ముమ్మర ఏర్పాట్లు

18న రాత్రి 1063 మందికి బస

19న అమరావతికి తరలింపు

నిలకడగా పొగాకు ధరలు

హత్య కేసులో ఒకరికి నాలుగేళ్ల జైలు

మద్యం మత్తులో కాలువలో పడి ఒకరి మృతి

లోపలి పేజీల్లో

ఏలూరు వైద్య కళాశాల భవనాలు ఏం నిర్మించారు ?

చర్చిద్దాం రండి

- పూర్తయినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- వైసీపీ నేతలకు ఎమ్మెల్యే బడేటి సవాల్
- టీడీపీ హయాంలోనే అనుమతులు, నిధులు
- పనులు చేపట్టింది మా ప్రభుత్వమే
- వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది
- ఇప్పుడు మేమే పూర్తి చేస్తాం


కళాశాల భవనంలో వర్షం నీరు బయటకు మళ్లింపు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి


నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలు నిర్మాణం పూర్తయినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి వైదొలుగుతానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) సవాల్ విసిరారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న వైద్య కళాశాల భవనం వద్ద ఎమ్మెల్యే చంటి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'అన్ని సదుపాయాలతో వైద్య కళాశాల పూర్తి చేశామని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైసీపీ నాయకులు చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడమే. జిల్లా వైద్యాధికారి కార్యాలయ ఆవరణలో తాత్కాలిక భవనాల వద్ద కేక్ కట్ చేయడం విడ్డూరంగా ఉంది. ఏలూరులో వైద్య కళాశాల ఏర్పాటు ఆలోచన 2018లో అప్పటి సీఎం చంద్రబాబు సంకల్పించి శంకుస్థాపన చేశారు. తర్వాత అధికారంలోకి రాకపోవడంతో వైసీపీ ప్రభుత్వం ఎక్కడో ఊరి చివర 34 ఎకరాల్లో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నామని శంకుస్థాపన చేసి మూలనపడేశారు. కేంద్రం నుంచి తొలుత అనుమతులు, నిధులు తమ ప్రభుత్వ హయాంలోనే మంజూరు చేయించాం. రూ.525 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం చేపట్టినా

మిగతా 8వ పేజీలో..

లెక్క తేలాల్సిందే..

స్థానిక సంస్థల నిధులకు ఆడిట్ అడ్డంకి



స్థానిక సంస్థల నిర్వహణకు ప్రభుత్వ గ్రాంట్లు, నిధులు అత్యంత కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులకు సంబంధించి ఖర్చు చేసిన ప్రతీ పైసాకు లెక్క కచ్చితంగా చూపాలి. ఖర్చు చేసిన నిధులపై సకాలంలో ఆడిట్ చేయించాలి. నిధులు, అభివృద్ధి పనుల బిల్లులను నిర్దేశిత పోర్టర్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఇవేమి పట్టనట్టు వ్యవహరిస్తే నిధుల విడుదలకు కొర్రీలు పడే అవకాశాలు ఎక్కువ.

- జిల్లాలో 35 శాతం పంచాయతీల్లో ఆడిట్
- నవంబరు వరకు ఆడిటింగ్
- అభ్యంతరాలుంటే నిధుల రాక ఆలస్యం
- బిల్లులు సంబంధిత పోర్టల్స్‌లో అప్‌లోడ్ చేయాలి



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్ వ్యవస్థలో పంచాయతీ, మండల పరిషత్, జడ్పీ విభాగాలతో పాటు, మునిసిపాల్టీలు, కార్పొరేషన్లు నిధుల ఖర్చుపై ఆడిట్ చేయించాల్సి ఉంటుంది. జిల్లాలో 27 మండలాల్లో 547 గ్రామ పంచాయతీలున్నాయి. గత ఏడాది పనుల నిర్వహణ, గ్రాంట్లకు సంబంధించి కేవలం 35 శాతమే ఆడిట్ చేయించారు. ఏటా పంచాయతీరాజ్, దేవాలయాలకు జిల్లా ఆడిట్ శాఖ అధికారి పర్యవేక్షణలో సహాయ ఆడిట్, ఇతర విభాగాల అధికారులు స్వయంగా ఆడిటింగ్ చేస్తారు. పంచాయతీలకు, 150 దేవాలయాలకు సంబంధించి ఆడిట్ ప్రారంభమై మూడో నెల గడుస్తోంది. సంబంధిత అధికారులు రానున్న నవంబరు వరకు మాత్రమే ఆడిట్ చేస్తారు. పాత బిల్లులను అప్‌డేట్ చేయించుకోవడం వలన 15వ ఆర్థిక సంఘం నిధుల నేరుగా కేంద్రం నుంచి ఆయా పంచాయతీలకు జమ అవుతాయి. ఈ నిధులు విడుదలలో ప్రధానమైనవి బేసిక్ నిధులు. వీటిని పూర్తి స్థాయిలో ఖర్చుపెట్టి సరైన లెక్క, పత్రాలతో నివేదికలు ఇస్తేనే పంచాయతీలు, స్థానిక సంస్థలకు పర్ఫార్మెన్స్ ఫండ్స్ (పనితీరు ఆధారం)గా రెండో విడత నిధులను కేంద్రం విడుదల చేస్తుంది. ఈ లోగా చేపట్టిన పనులకు బిల్లులను సంబంధిత ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఆడిట్‌కు ముందుకు రావాలి

స్థానిక సంస్థల్లో ఆడిటింగ్ ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటికే సగం కాలం గడిచిపోయింది. నవంబరు నెలాఖరుకు వరకు గడువు ఇచ్చాం. సకాలంలో బిల్లుల, పత్రాలతో వచ్చి ఆడిట్ చేయించుకోవాలి. ఇబ్బందులుంటే ఫోన్ 9848779548 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

ఆర్‌వీఆర్ గంగాధరరావు, జిల్లా ఆడిట్ అధికారి



నేటి నుంచి వాహన మిత్రకు

దరఖాస్తు చేయొచ్చు

- జిల్లాలో 30 వేల మంది పైబడి అర్హత పొందే అవకాశం
- కొత్తవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్‌లో పేర్లు చూసుకోవాలని అధికారుల సూచన
- అక్టోబర్ 2న ఆటో యజమానుల ఖాతాల్లో సొమ్ము జమ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఆటో, క్యాబ్, టాక్సీ నడుపుతున్న యజమానులకు కూటమి ప్రభుత్వం వాహన మిత్ర ద్వారా రూ.15 వేలు లబ్ధి చేకూర్చేందుకు కసరత్తు చేపట్టింది. వాహనమిత్రకు అర్హులు బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాల వలన తాము తీవ్రంగా నష్టపోయామని ఆటో యజమానులు, డ్రైవర్లు ఇటీవల ఆందోళన చేపట్టారు. ఉపాధి పోయిందని, పూట గడవడం కష్టం మారిందని పలు చోట్ల ధర్నా చేశారు. వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరి శీలించిన టీడీపీ సర్కారు వారికి వాహనమిత్ర అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏటా పదివేల చొప్పున ఆటోవాలాలకు అందించిన ప్రభుత్వం టాక్స్‌ల రూపంలో అంతకంటే పెనుభారం మోపింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారికి కొన్ని విధాలా పన్ను రాయితీలను కూడా కల్పించింది. ఇటీవల గ్రామాలు, పట్టణాల్లో ఆటోల సంఖ్య పెరిగింది. యువత కూడా వీటి ఆసరాగానే ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో ఉపరవాణాశాఖ అధికారి (డీటీసీ) షేక్ కరీమ్ లెక్కల ప్రకారం జిల్లాలో లైసెన్సు పొందిన ఆటోలు రిజిస్ట్రేషన్లు 27వేలకు పైగా ఉండగా, క్యాబ్, టాక్సీలు కింద 3500 ఉన్నట్లు చెబు తున్నారు. దీంతో ఈ వాహనమిత్ర సాయం అందుకునే వారి సంఖ్య 30 వేలకు పైబడి ఉండవచ్చునని అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. కొత్త వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, గతంలో పొందిన వారు అవసరం లేదని చెబుతున్నప్పటికీ ఆన్‌లైన్‌లో వివరాలను చూసుకొని లేకపోతే దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసుకోవాల్సి ఉంటుంది.

24న తుది జాబితాలు..

వాహనమిత్రకు అర్హులు ఈ నెల 17 నుంచి 19 వరకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. గతంలో లబ్ధి పొందిన వారు దరఖాస్తు చేయనవసరం లేదు. కొత్త వారి నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్, పాఠశాల సంక్షేమాధికారికి దరఖాస్తులను స్వీకరిస్తారు. 23 వరకు దరఖాస్తులను వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పరిశీలించి, తుది జాబితాలను 24 సచివాలయాల వద్ద ఉంచుతారు.

ఇవి కావాలి..

దరఖాస్తుదారుకు విధిగా ఆధార్ లింక్డ్ బ్యాంక్ ఖాతా ఉండాలి. పాత లబ్ధిదారుల పేర్లు 12 నుంచి ఆటోమేటిక్‌గా సచివాలయానికి వెరిఫికేషన్‌కు వస్తారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు కలిగి ఉండి, సొంత ఆటో లేదా, టాక్సీ క్యాబ్ ఉండాలి. ఒరిజనల్ ఆర్‌సీ తన పేరు మీద ఉండాలి. ట్రాన్స్‌ఫోర్టు వెహికల్ అయ్యి ఉండాలి. ఎల్లో నెంబర్ ప్లేట్ ఉండాలి. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి, సంబంధిత వాహనం వెహికల్ రిజిస్ట్రేషన్ చిరునామా రాష్ట్రంలో ఉండాలి. బ్యాంకు ఖాతా వివరాలు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం పూర్తి వివరాలను దరఖాస్తులో పేర్కొనాలి.


పెరుగుగూడెంలో జలమయమైన రహదారి

భారీ వర్షం

- ద్వారకాతిరుమలలో అత్యధికం
- ఏజెన్సీలో పొంగిన కొండ వాగులు
- నిలిచిపోయిన రాకపోకలు
- పెరుగుగూడెంలో రహదారులు జలమయం
- వాహనదారులకు ఇబ్బందులు

జిల్లాలో 6.4 మి.మీ. వర్షపాతం

ఏలూరుసిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా లో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో సరాసరి 6.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ద్వారకాతిరుమల మండలంలో అత్యధికంగా 35 మి.మీ. వర్షపాతం నమోదైంది. జంగారెడ్డిగూడెంలో 34.6, చింతలపూడి 14.2, జీలుగుమిల్లి 12.8, బుట్టాయిగూడెం 11, కుక్కునూరు 9.8, కొయ్యలగూడెం 8.4, మండవల్లి 7.6, పోలవరం 6.8, టి.నరసాపురం 6.2, దెందులూరు 4.2, వేలేరుపాడు 3.8, నూజివీడు 3.4, ఉంగుటూరు 3.4, భీమడోలు 3.4, నిడమర్రు 3, చాట్రాయి 2.8, లింగపాలెం 2.6, ముదినేపల్లి 2.4, ఆగిరిపల్లి 1.4, కైకలూరు 1.4, పెద పాడులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు అనుకూలమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

బుట్టాయగూడెం/దెందులూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. కొండవాగులు పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. మంగళవారం కంసాలికుంట-పద్మవారిగూడెం గ్రామాల మధ్య అల్లి కాలువ కొండవాగు పొంగి రాకపోకలకు అంతరాయం కలిగింది. వాగుకు ఇరువైపులా వాహనాలు, జనాలు నిలిచిపోయారు. వాగు ఉధృతి తగ్గుముఖం పట్టేవరకు అక్కడే పడిగాపులు పడ్డారు. అల్లికాలువ ఉధృతిని పరిశీలించిన ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రజలను అప్రమత్తం చేశారు.

దెందులూరు మండలంలో పలు గ్రామాల్లో ఎండ మరికొన్ని గ్రామాల్లో పిడుగులతో వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం నుంచి 9 గంటల వరకు పెరుగుగూడెం, చల్లచింతలపూడి, పోతునూరు, కొవ్వలి తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులు హడలెత్తించాయి. భారీ వర్షంతో పెరుగుగూడెంలో రోడ్లు కాలువలను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్డుపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


పోలవరం వద్ద గోదావరి ఉధృతి

తగ్గుతూ.. పెరుగుతూ..

కుక్కునూరు/పోలవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద మరలా నెమ్మదించింది. భద్రాచలం వద్ద 39.50 అడుగులు నీటిమట్టం నమోదైంది. సాయంత్రానికి నెమ్మదిగా తగ్గుతూ 38అడుగులకు చేరింది. కాగా దిగువన పోలవరం వద్ద నీటి మట్టం పెరుగుతోంది. కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య గుండేటివాగు లోలెవెల్ కాజ్‌వే నీట మునిగింది. ప్రజలు నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పోలవరం వద్ద నీటిమట్టం పెరగడంతో ప్రాజెక్టు నుంచి 7,66,812 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 31.600 మీటర్లు, దిగువన 22.750 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పట్టిసీమ శివక్షేత్రం వద్ద వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.


అల్లికాలువ వాగు వద్ద నిలిచిన రాకపోకలు


కొల్లి బాబ్జీని వైద్య పరీక్షల నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చిన కైకలూరు పోలీసులు

దానగూడెం ఘటనలో కొల్లి బాబ్జి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):దానగూడెం దళితులపై దాడి సంఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కైకలూరు జనసేన నాయకుడు కొల్లి వీరవెంకట సత్య వరప్రసాద్ అలియాస్ బాబ్జి మంగళవారం ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ముందు లొంగిపోయాడు. కైకలూరులో ఈనెల 5న రాత్రి వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా దానగూడేనికి చెందిన పైయెద్దు అజయ్ (19) మరికొందరిపై దాడి చేశారు. కేసు నమోదు చేసిన కైకలూరు టౌన్ పోలీసులు ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేశారు. 7వ నిందితుడిగా ఉన్న కైకలూరు కొల్లేటి కోటకు చెందిన బాబ్జి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో లొంగిపోవడంతో అతడిని కైకలూరు పోలీసులు అరెస్టు చేసి వైద్య పరీక్షల నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. బుధవారం కైకలూరు కోర్టులో హాజరుపర్చనున్నారు.

ఆగని మట్టి దందా

ఈదులగూడెం శివారు వద్ద గుట్టలుగా మట్టి నిల్వలు


ఈదులగూడెం సమీపంలోని ఒక పొలంలో డంప్ చేసిన మట్టి

నూజివీడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలంలో మట్టి మాఫియా ఆగడాలను అరికట్టలేకపోతున్నారు. మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలను పత్రికలు వెలుగులోకి తెచ్చినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతి లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిపితే చర్యలు ఉంటాయని చెప్పి ఊరుకున్నారు. రెండు, మూడునెలల క్రితం మండలంలోని నూగొండపల్లిలో ఒక చెరువు పక్కనే పొలంలో చెరువు మట్టిని గుట్టలు పోసి తరలించడానికి సిద్ధంగా ఉంచిన విషయాన్ని పత్రికలు వెలుగులోకి తెచ్చినా రెవెన్యూ, గనులశాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. గనులశాఖ మట్టి విలువను లెక్కిస్తే అక్రమ మట్టితవ్వకాలకు పాల్పడే వారిపై జరిమానా విధించడం జరుగుతుందని రెవెన్యూ శాఖ చేతులు దులిపేసుకుంది. ఇంతవరకు గనులశాఖ వచ్చింది లేదు. తాజాగా కలటూరు రెవెన్యూ పరిధిలో ఈదులగూడెం శివారు వద్ద ఒక పొలంలో చెరువుమట్టి గుట్టలు వెలుగు లోకి వచ్చాయి. అమ్మవారిగూడెం వద్ద గ్రావెల్‌గట్టు వద్ద ఒక ఎక్స్‌కవేటర్‌ను తవ్వకాల కోసం ఉంచడం కనిపించింది.

ఆధ్యాత్మికం




ద్వారకాతిరుమల ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొడుతున్న బాలలు.. శ్రీవారి పల్లకి ఊరేగింపు

చిన వెంకన్న క్షేత్రంలో 'ఉట్టి పండుగ'

ద్వారకాతిరుమల,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):చినవెంకన్న క్షేత్రంలో మంగళవారం సాయంత్రం ఉట్టికొట్టే పండుగ వేడుకగా జరిగింది. శ్రీవారి ఆలయంలో సోమవారం మిగులు తిథి పురస్కరించుకుని కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజు మంగళవారం ఉట్టికొట్టే పండుగ జరపడం సంప్రదాయబద్ధమైంది. తొలుత ఆలయంలో స్వామి అమ్మవార్లను రాజాధిరాజ వాహనంపై ఉంచి అర్చకులు పూజాదికాలు జరిపారు. అనంతరం అట్టహాసంగా క్షేత్ర పురవీధులకు తీసు కొచ్చారు. పలుచోట్ల స్వామివారి వాహనం ఎదుట యువకులు ఉత్సాహంగా ఉట్టికొట్టి భక్తి ప్రపత్తులను చాటారు. ఆద్యంతం ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది.



దెందులూరులో నిప్పుల గుండం తొక్కుతున్న భక్తులు

మద్దిరావమ్మ సన్నిధిలో 'అగ్నిగుండ ప్రవేశం'

దెందులూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):దెందులూరు గ్రామ దేవత మద్దిరావమ్మ వారి అగ్నిగుండ (నిప్పులగుండం) ప్రవేశంలో మంగళవారం అధి క సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత దెందులూరు బస్టాండ్ సెంటర్ సమీపంలో ఉన్న అమ్మవారి ఆలయంలో గణాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహి ంచి నిప్పుల గుండం ప్రవేశం ప్రారంభించారు. భక్తులు, మహిళలు అమ్మవారి గరగాన్ని తలపై ఉంచుకుని నిప్పులు తొక్కారు. గ్రామస్థులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు.

పారిజాత గిరి శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి వార్షిక పవిత్ర ఉత్సవాలు వైభవంగా ప్రారంభ మయ్యాయి. సాయంత్రం ఆరు గంటలకు పొండింగి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, మేదిని అమ్మవారి అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, ఈనెల 19వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, రిషికేశ్ ఆచార్యులు పూజలు చేశారు.



మేదిని అమ్మవారి చిత్రం



విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న డైట్ కాలేజీ ప్రిన్సిపాల్, తదితరులు

విద్యార్థులకు 'కళా ఉత్సవ్' బహుమతులు

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఇటీవల దూబచర్ల డైట్ కళాశాలలో నిర్వహించిన కళాఉత్సవ్-2025 జిల్లాస్థాయి పోటీల్లో ఏలూరు శ్రీశర్వాణి హైస్కూలు విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు గెలుచుకుని, రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ హెచ్‌ఎం సత్యశారద ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'దృశ్యకళలు-3డి-శిల్పకళ' పోటీలో కె.గోపిచంద్రిక ప్రథమ బహుమతి, స్వదేశీ బొమ్మల తయారీ పోటీలో పి.శ్వేత, కె.మనస్విని బృందం ద్వితీయ బహుమతి, థియేటర్ ఆర్ట్స్(నాటకం)పోటీలో ఎస్.చరిష్మ బృందం ద్వితీయ బహుమతి గెలుచుకున్నారన్నారు. రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలు విజయవాడలో అక్టోబరు 24, 25 తేదీల్లో జరుగుతాయన్నారు. విజేతలను స్కూలు డైరెక్టర్ మదనమోహనరాజు అభినందించారు.

సత్యసాయి శత జయంతికి భారీ ఏర్పాట్లు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో నవంబరు 17 నుంచి 24 వరకు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు పూర్తి చేశామని సత్యసాయి సేవా సంస్థల ఏపీ అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖరరావు తెలిపారు. మంగళవారం ఏలూరు-రామకృష్ణాపురంలోని సత్యసాయి సేవా కేంద్రం వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని రాష్ట్రాలు, విదేశాల నుంచి ఈ ఉత్సవాలకు సుమారు 15 లక్షల మంది వస్తారని అంచనా ఉందన్నారు. నవంబరు 18న వెండి రథోత్సవాన్ని ప్రారంభిస్తారని, 17 నుంచి 24 వరకు తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్టు వివరించారు. జిల్లాలో 40 నూతన భజన మండళ్లు ప్రారంభించినట్టు చెప్పారు. సేవా సంస్థల భక్తులు గారపాటి శాంతి, కానుమిల్లి వెంకటేశ్వరరావు, పయిడేటి రామారావు, కానుమిల్లి లక్ష్మి, తదితర సభ్యులు ఉన్నారు.




మాట్లాడుతున్న సేవా సంస్థల ఏపీ అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు శశిశేఖరరావు

ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో మిగిలివున్న సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ డి.భూషణం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తుచేసుకుని, అప్లికేషన్ కాపీ ప్రింటవుట్, ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థి ఎంచుకున్న సంబంధిత ఐటీఐ కాలేజీలో 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో అడ్మిషన్లకు దరఖాస్తుచేసుకున్న విద్యార్థులకు ఈనెల 29న, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం 08812-230269 నంబరులో సంప్రదించాలని కోరారు.

తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మహారాష్ట్ర ఉల్లి

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి పది లారీల్లో ఉల్లిపాయలు వచ్చాయి. వీటి ధర క్వింటా రూ.1300 నుంచి 1700 మధ్య విక్రయాలు జరిగాయి. ఇక కర్నూలు నుంచి ఒక్క లారీ కూడా తాడేపల్లిగూడెం రాలేదు. కడప నుంచి ఏడు టన్నుల లోడుతో ఒక లారీ వచ్చింది. వీటిలో 60 బస్తాలు క్వింటా రూ.1000కు ధర పలికింది. 80 బస్తాలకు క్వింటా రూ.900 చొప్పున విక్రయాలు జరిగాయి. మిగిలిన 20 బస్తాలు క్వింటా రూ.250 వంతున అమ్మారు. ఉల్లి మార్కెట్ పరిస్థితిని మార్కెట్ యార్డు డీడీ పాపారావు, తాడేపల్లిగూడెం ఏఎంసీ కార్యదర్శి గౌస్‌బాషా, సూపర్‌వైజర్లు ఫణికిషోర్, వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



రైళ్లు ఆపండి..

భీమడోలు రైల్వే స్టేషన్‌లో రైళ్ల హాల్ట్‌కు శ్రీవారి భక్తుల వినతి



భీమడోలు రైల్వే స్టేషన్ నుంచి ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు.. (ఇన్‌సెట్‌లో) ఆటోల కోసం వెళుతున్న యాత్రికులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ప్రాంతమైన చినవెంకన్న ఆలయానికి విచ్చేసే యాత్రికుల సౌకర్యార్థం భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయించాలని భక్తులు కోరుతున్నారు. చినవెంకన్న ఆలయానికి ప్రతిరోజూ వేల సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు వీరంతా బస్సులు, రైళ్లద్వారా ద్వారకాతిరుమలకు చేరుకుంటారు. ద్వారకాతిరుమలకు భీమడోలు రైల్వేస్టేషన్ కేవలం 16 కిలోమీటర్లు దూరంకాగా ఏలూరు రైల్వే స్టేషన్ 39 కిలోమీటర్ల వరకూ వస్తుంది. భీమడోలు రైల్వే స్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లతో పాటు తిరుమల, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే ఆగుతాయి. మిగిలిన ఎక్స్‌ప్రెస్‌లు ఏలూరు, తాడేపల్లిగూడెంలలో ఆగడంతో అక్కడి నుంచి ఎంతో వ్యయప్రయాసలతో ద్వారకాతిరుమల క్షేత్రానికి భక్తులు రావాల్సి ఉంటుంది. కాకినాడ-తిరుపతి, జన్మభూమి, రత్నాచల్ వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు భీమడోలులో ఆపితే భక్తులకు మరింత సౌకర్యం కలిగే అవకాశం ఉంది. నిత్యం ఈ రైల్వేస్టేషన్ నుంచి వందలాది మంది శని, ఆదివారాల్లో వేలాది మంది యాత్రికులు, రైళ్లుదిగి ఆటోలు, బస్సులలో ద్వారకాతిరుమలకు చేరుకుంటారు. అదేవిధంగా భీమడోలు పరిసరప్రాంతాలకు చెందిన 30గ్రామాల ప్రజలు సైతం ఈ రైల్వేస్టేషన్ ద్వారా రాకపోకలు సాగిస్తారు. నిత్యం పలువురు ఉద్యోగులు, వ్యాపారులు, యువత, సామాన్యులు ప్రయాణించే ఈప్రాంతంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయకపోవడం అటు భక్తులతో పాటు పరిసరప్రాంతాల ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కల్గిస్తుంది. సుదూరప్రాంతాల నుంచి వచ్చే చినవెంకన్న భక్తులకు ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

'అన్నవరం' మాదిరిగా ఆపాలి..

ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం అన్నవరం క్షేత్రంలో మాదిరిగా ఇక్కడ పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపితే వారికి మరింత వెసులు బాటు ఉంటుందని అంటున్నారు. గుండుగొలను-కొవ్వూరు, గుండుగొలను- రావులపాలెం హైవేలను అనుసంధానంగా ఉండే భీమడోలు రైల్వేస్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసి మెరుగైన సౌకర్యాలను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యను ఇటీవల ఏలూరు పర్యటనకు వచ్చిన గవర్నర్‌కు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ దృష్టికి పలువురు తీసుకెళ్లారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

రైళ్లు ఆపితే భక్తులకు సౌకర్యం



ద్వారకాతిరుమల క్షేత్రానికి ఇక్కడి నుంచి 17 కిలోమీటర్లు దూరం ఉంటుంది. దూరప్రాంతాల నుంచి రైళ్లలో వచ్చేవారు ఏలూరు, తాడేపల్లిగూడెంలో దిగా రావాల్సివస్తోంది. అలా కాకుండా ఎక్స్‌ప్రెస్ రైళ్లను భీమడోలులో ఆపితే అటూ భక్తులకు ఇటు రోజూ తిరిగే వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులకు వెసులుబాటుగా ఉంటుంది.

- శివ, ఆటో డ్రైవర్ భీమడోలు జంక్షన్.

మా చిరకాల కోరిక..



భీమడోలు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలన్న కోరిక స్థానికుల్లో ఎప్పటినుంచో ఉంది. అయినా నాయకులు, అధికారులు పట్టించు కోవడంలేదు. దీనివల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది ప్రయాణించే రైల్వేస్టేషన్ అభివృద్ధిపై దృష్టిసారించడంలేదు. దీనిని అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పిస్తే ఎందరికో మేలు జరుగుతుంది.

- రాజు, భీమడోలు, స్థానికుడు

మహిళల ఆరోగ్యానికి జై

మహిళల ఆరోగ్య పరిరక్షణకు 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో నేటి నుంచి అక్టోబరు 2 వరకు వైద్యశిబిరాలు

నిడమర్రు/పాలకొల్లు/భీమవరం టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో మహిళ బాగుంటే ఆ కుటుంబం అంతా బాగుంటుందనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ముఖ్యంగా మహిళ ఆరోగ్యం మీద కుటుంబ ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. అటువంటి మహిళలకు బాల్యం, కౌమారం, యవ్వనం, నడివయస్సు, వృద్ధాప్య దశలలో ఆరోగ్య సంరక్షణ కోసం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహి స్తోంది. సెప్టెంబరు 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలను ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా నిర్వహిం చేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేయనుంది.

మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ- శక్తివంతమైన కుటుంబం) అను సమగ్ర ఆరోగ్య సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం బుధవారం ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రి సముదాయంలో కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన ప్రారంభించనున్నారు. వీటితో అన్ని నియోజకవర్గాలలో ఆయా ప్రధాన ఆసుపత్రుల ప్రాంగణంలో ప్రారంభోత్సవాలు ఆయా ప్రజాప్రతినిధులతో జరగనుంది. మహిళ ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఆరోగ్యం ఉండగలనేదే ముఖ్య ఉద్దేశ్యం.

కార్యక్రమ లక్ష్యాలు ..

- మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం
- మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం
- పోషకాహారం స్వీకరించడాన్ని ప్రోత్సహించడం
- జీవనోపాధికి స్వశక్తి మీద ఆధారపడే విధంగా ప్రోత్సహించడం

కార్యక్రమ నిర్వహణ ఇలా..

నేటి నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు అనగా 15 రోజుల పాటు నిర్వహించే వైద్య శిబిరాల క్యాంపులలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా 548 క్యాంపులు, పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 471 క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మూడేళ్ల నుంచి 80 ఏళ్ల వయస్సు గల మహిళలకు వైద్య పరీక్షలు చేయడం. రోగాలు గుర్తింపు వైద్య సేవలు అందించడం. రక్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం, గ్రామస్థాయిలో వైద్య శాఖ, మహిళా శిశుసంక్షేమశాఖ, పంచాయతీరాజ్ శాఖ, మునిసిపల్ శాఖ, డీఆర్‌డీఏ, మొదలగు శాఖలు భాగస్వాములవుతాయి.

ప్రత్యేక వైద్య శిబిరాల్లో సేవలు

- మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షల నిర్వహణ, రిఫరల్ సేవలు అందించడం.
- కిశోర బాలికలకు, మహిళలకు రక్తహీనత పరీక్షల నిర్వహణ, చికిత్సలు చేయడం.
- గర్భవతుల పరీక్షల నిర్వహణ పోషకాహారం ఆవశ్యకత గురించి వివరణ.
- పిల్లల్లో సికిల్‌సెల్ అనీమియాను గర్తించి వైద్య సేవలు అందించడం.
- రక్తదాన శిబిరాల నిర్వహణ.
- ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు అందించడం



లంకలకోడేరు పీహెచ్‌సీలో వైద్యులకు సూచనలు చేస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా వైద్యాధికారి గీతాబాయి

471 ప్రదేశాల్లో వైద్య శిబిరాలు

» పశ్చిమ గోదావరి జిల్లా డీఎంహెచ్‌వో గీతాబాయి

పశ్చిమ గోదావరి జిల్లాలో 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 366 హెల్త్ అండ్ వెల్త్ సెంటర్లు, ఒక జిల్లా ఆసుపత్రి, నాలుగు ఏరియా ఆసుపత్రులు, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మొత్తం కలిపి 471 ప్రదేశాలలో, నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రతీ రోజూ ప్రత్యేక వైద్యశిబిరాలను వైద్యనిపుణులు, పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తామని పశ్చిమ గోదావరి జిల్లా వైద్యాధికారి గీతాబాయి తెలిపారు. మంగళవారం లంకలకోడేరు పీహెచ్‌సీలో వైద్య శిబిరాల ఏర్పాట్లపై వైద్యాధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వైద్య శిభిరాలు నిర్వాహకం సంబంధిత ఆరోగ్య కేంద్ర-ఆసుపత్రి వైద్యాధికారులు నేతృత్వంలో నిర్వహిస్తారన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో వైద్య శాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖ, పంచాయితీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖ, డీఆర్‌డీఏ మొదలగు శాఖల సమన్వయంతో ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలందరూ స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ అను కార్యక్రమంలో మీకు అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలలో పాల్గొని అవసరమైన ఆరోగ్య సేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక నోడల్ అధికారి డీపీఎంవో ధనలక్ష్మి, డాక్టర్ ఎం.నవ్యజీవన్, డాక్టర్ జి.దినేష్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్‌పీ ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఏలూరు జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేశాం. దీనిలో భాగంగా 548 క్యాంపులు నిర్వహిస్తున్నాం. ఈ క్యాంపుల ద్వారా చంటి పిల్లలకు టీకాలు మొదలు యుక్త వయస్సు బాలికలకు రక్తహీనత పరీక్షలు, మహిళలకు బీపీ,షుగర్ పరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తాం. గర్భిణులకు వైద్య సదుపాయంతో పాటు పోషకాహార ప్రాధాన్యతను తెలియజేస్తాం. మహిళలు ఈ వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ పీజే అమృతం, డీఎంహెచ్‌వో, ఏలూరు జిల్లా

ఆరోగ్య ప్రదాయిని తాటిపండ్లు

» ఔషధ గుణాలు ఉన్నాయంటున్న వైద్యనిపుణులు » తాటి పండ్లతో అనేక వంటకాలు తయారు చేస్తున్న గ్రామీణ మహిళలు

గణపవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మామిడిపండ్ల సీజన్ వెళ్లిన వెంటనే గుర్తుకొచ్చేది తాడిపండ్లే. బాద్రపద మాసాల్లో పుష్కలంగా లభించే తాటిపండ్లు తెలియని వారు ఉండరు. తాటిపండ్లు ఏడాదికాలం పాటు లభించవు. ప్రస్తుత వర్షాకాలంలో లభిస్తున్న ఈ తాటి పండ్లతో అనేక పిండిపదార్థాలు తయారు చేస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా తాటిపండ్లను మన పూర్వీకులు ఎన్నో రకాల వంట పదార్థాలుగా ఉపయోగించేవారు. తాటికాయలు పక్వానికి వచ్చిన తరువాత తాటిపండ్లుగా తయారై అవి చెట్ల నుంచి రాలిపడతాయి. అవి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, రైతులు సేకరించుకుని పిండి వంటలుగా ఉపయోగిస్తారు. ఇళ్లల్లో మహిళలు తాటిపండ్లు కుంపటిలో పెట్టి గుండ్రంగా కాలే వరకు తిప్పుతుంటారు. కాలినతరువాత పైతొక్క తొలగించి లోన టెంకకు ఉన్న గుజ్జును ఒక అడుగు ఎత్తున ఉండే ఇనుప నిచ్చెనలాంటి పరికరంతో గుజ్జును మహిళలు తీస్తారు. ఆ గుజ్జుతో బియ్యంరవ్వ, బెల్లం, పంచదార, యాల కులతో కలిపి గారెలు, రొట్టెలు, కుంపటిపై తయారు చేస్తారు. తాటిపండులో ఔషధగుణాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.



తాటి గారెలు



తాటి రొట్టె



తాటి తాండ్ర



తాడిపండు నుంచి గుజ్జు తీస్తున్న మహిళలు



తాటి పండ్లు

తాటి గారెలు, రొట్టెలు హైదరాబాద్, చెన్నైకు పంపుతాం



తాటిపండ్ల సీజన్‌లో అనేక పిండివంటలు చేస్తుంటాం. తాటిగారెలు, రొట్టెలు, ఇడ్లీలు, తాటితాండ్ర తయారు చేస్తాం. కుటుంబసభ్యులమంతా తాటిపండ్ల సీజన్‌లో రుచికరమైన వంటకాలు తయారు చేయడం, అమ్మమ్మ దగ్గర నుంచి నేర్చుకున్నాం. తయారు చేసిన గారెలు, రొట్టెలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న పిల్లలకు, బంధువులకు పంపుతాం. ఎంతో ఇష్టంగా తింటారు.

- సంకు స్నేహలత, భువనపల్లి

తాటిపండ్లలో పోషకాలు ఇలా..

- తాటిపండ్లలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి.
- జీర్ణవ్యవస్థను మెరుగు చేస్తుంది. మలబద్ధకం నివారిస్తుంది.
- ఇన్‌ఫెక్షన్ రాకుండా చేస్తుంది..రక్తహీనత తగ్గిస్తుంది.
- కంటి ఆరోగ్యానికి విటమిన్-ఎ ఉంటుంది.
- ఎముకల బలం, దంతాల ఆరోగ్యానికి సాయపడుతుంది.
- గాయాల నివారణకు పనిచేస్తుంది.
- జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

క్రీడా సమాచారం



భీమవరంలో ట్రోఫీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

21న భీమవరంలో బాడీ బిల్డింగ్ పోటీలు

భీమవరంటౌన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): భీమవరంలో న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహిస్తున్న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్, మిస్టర్ ఆంధ్ర ఫిజిక్ మోడలింగ్ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భీమవరంలో పోటీల విజేతలకు అందించే ట్రోఫీను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. బాడీ బిల్డింగ్ పోటీల్లోని విజేతలకు ట్రోఫీలతోపాటు మూడు మోటార్ బైక్‌లు, టీవీలు అందించేందుకు నిర్ణయించడం విశేషమన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసీం, అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి బాడీ బిల్డర్లు హాజరవుతారని, పోటీలను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభిస్తారన్నారు. దాసి ప్రసాద్, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, బ్యాంక్ బాబి, ఆకుల కృష్ణ, మున్న, హర్ష, జగదీష్, రిచి, ఆర్కే పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఈనెల 18వ తేదీన జరగాల్సిన అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు వాయిదా వేశామని పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎస్కే షాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీమవరంలోని డీఎన్నార్ కళాశాల మైదానంలో వర్షపునీరు చేరడంతో ఎంపిక పోటీలు వాయిదా వేశామన్నారు. క్రీడాకారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో ఎంపిక పోటీల తేదీలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.



ప్రశంసాపత్రాలతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అథ్లెటిక్స్‌లో కేంబ్రిడ్జ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన పోటీల్లో స్థానిక కేంబ్రిడ్జ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ స్కూల్ ఛైర్మన్ ఇళ్ల శ్రీనివాస్ తెలిపారు. 600 మీటర్స్ రన్నింగ్‌లో (గరల్స్) శ్రీహారిక ద్వితీయ స్థానం, 80 మీటర్ల హర్డిల్స్‌లో ఎస్.భావన ద్వితీయ, జావెలిన్ త్రోలో పి.హారిక మూడో స్థానం, ట్రిటలాన్ విభాగంలో బి.ధనహర్ష తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు భీమడోలు విద్యార్థులు

భీమడోలు,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భీమడోలు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఏలూరులో ఈనెల 15న జరిగిన అండర్ 14, 16 జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న హైస్కూలు విద్యార్థుల్లో ఎనిమిది మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పి.ఆదిత్య, లాంగ్‌జంప్, ఎం.ఉమాలక్ష్మి లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం, కె. అమరేంద్రబాబు, బ్యాక్‌అండ్‌త్రో ప్రథమస్థానం, అండర్-16 బ్యాక్ అండ్ త్రోలో డి.విజయలక్ష్మి ప్రథమస్థానం, బి.రాహుల్ ద్వితీయ స్థానం, షాట్ పుట్‌లో ఎస్.హర్షిత ద్వితీయ స్థానం, జావలిన్ త్రోలో వి.రాజ్యలక్ష్మి ప్రథమ స్థానంలో నిలవగా ఈనెల 27 నుంచి 29 తేదీల్లో ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో జరిగే అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని హెచ్‌ఎం పద్మజ తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

పెనుగొండ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాష్యం విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ వెంకటఅప్పారావు మంగళవారం తెలిపారు. ఈనెల 15న తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో అండర్-14,16,18, 20 బాలురు, బాలికల విభాగాల్లో ఎంపికలు జరిగాయన్నారు. భాష్యం పాఠశాలకు చెందిన యు.డెన్నిప్రేమ్(9వ) అండర్-14 బాలురు ట్రైయాతలిన్-ఎలో జిల్లా ద్వితీయ స్థానాన్ని, ఎంఎస్ఎన్‌డీడీ శివ (8వ) అండర్-14 బాలురు ట్రైయాతలిన్-బిలో జిల్లా ద్వితీయ స్థానాన్ని కైవశం చేసుకున్నారన్నారు. చాంప్స్ ఇన్‌చార్జి రాణీ రోజాజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆప్కాబ్ చైర్మన్ గన్నికి టీడీపీ నాయకుల సన్మానం


గన్నిని సత్కరిస్తున్న గణపవరం నాయకులు

గణపవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిమ్లాలో జరిగిన జాతీయ సహకార బ్యాంకుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకుల పనితీరులో 2వ స్థానం సాధించిన సందర్భంగా ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును గణపవరం మండల టీడీపీ నాయకులు, సొసైటీ చైర్మన్‌లు సన్మానించారు. మంగళవారం గణపవరం నుంచి ర్యాలీగా తరలి వెళ్లి ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, మొయ్యేరు సొసైటీ చైర్ పర్సన్ కానుమిల్లి వెంకటేశ్వరరావు(చంటి), కార్యదర్శి ఎండీ శ్రీనివాసరావు, ముగ్గళ్ల సొసైటీ చైర్మన్ గురుజు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డులో క్లైమ్‌ల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే బొలిశెట్టికి వినతి పత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్‌బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌ల పరిష్కారం కోసం తాను కృషిచేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు ఎమ్మెల్యేను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుం దర్, ఏరియా కమిటీ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, యూనియన్ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు పాల్గొన్నారు.

కూటమి నాయకులు ఐక్యంగా ముందుకు వెళ్లాలి


ఎంపీ పాకాను సత్కరిస్తున్న బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు ఐక్యంగా ముందుకు వెళ్లాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి ఆహ్వానం మేరకు మంగళవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా బాబ్జిని కలిశారు. బాబ్జి వంటి నాయకులు ఎంతో మంది త్యాగాలు చేస్తేనే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పాకాను సత్కరించారు. భోగిరెడ్డి ఆదిలక్ష్మి, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలి


రేషన్ దుకాణాల కాటాల సీల్ వేస్తున్న తూనికలు, కొలతల శాఖ సిబ్బంది

ఆకివీడు సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు దుకాణాల్లో కొనుగోలు సమయంలో మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని భీమవరం తూనికలు-కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శివ మోహన్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయ భవనంలో మంగళవారం రేషన్ దుకాణాల ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్స్ వేసి మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబరు నెలలో వివిధ దుకాణాలకు సంబంధించి వర్తకులపై 21 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఎంఆర్పీల కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. అంతే కాకుండా తూకం రాళ్ళకు సీల్స్ లేకుండా అమ్మకాలు జరుపుతున్నా తమకు ఫోన్ నెంబరు 91761 61155కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆర్ఐ ఆంజనేయులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఇంద్రయ్య విద్యార్థుల ఎంపిక


పతకాలు సాధించిన విద్యార్థులు

తణుకు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ షాట్‌పుట్ విభాగంలో టి.రత్న కుమార్ ప్రథమ స్థానం, ఎం.మహేష్‌కుమార్ రన్నింగ్ రేస్‌లో ద్వితీయ స్థానం, ఎం. విజయ్‌కుమార్ లాంగ్ జంప్, హైజంపులో ప్రథమ స్థానం, ఎం.లక్ష్మీనారాయణ హేమర్‌త్రోలో ద్వితీయ, పి.దుర్గా మల్లేశ్వరి రన్నింగ్, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానాలు సాధించినట్లు తెలిపారు. ఎంపికైె వారంతా ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉండి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ఉండి, ఆచంట ప్రభుత్వ ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరంలో మిగిలి వున్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉండి పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి డి.ఆనంద వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 27లోగా ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయించుకుని సమీప ప్రభుత్వ ఐటీఐలలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. 29న జరుగు కౌన్సెలింగ్ సమయంలో రశీదును చూపించాలని కన్వీనరు తెలిపారు. రెండు సంవత్సరాల కోర్సు పూర్తిచేసిన వారు బ్రిడ్జి కోర్సు ద్వారా పాలిటెక్నిక్‌లో రెండవ సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

సముద్ర కాలుష్య నివారణపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ఆక్వా యూనివర్సిటీ విద్యార్థులు

నరసాపురం రూరల్, సెప్టెం బరు 16 (ఆంధ్రజ్యోతి): సముద్ర కాలుష్య నివారణపై మంగళవారం లక్ష్మణేశ్వరం ఆక్వా యూనివర్సిటీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి విశాఖకు చెందిన ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండి యాకు చెందిన శాస్త్రవేత్త ప్రసాద్, మత్స్య కళాశాల ప్రొఫెసర్ టి.సుగుణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల సముద్ర జీవులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. కళాశాల డీన్ మాధవి, సి.ధనుంజయ్‌రావు, సీడీ రావు మాట్లాడుతూ సముద్ర వేట అనంతరం వలలు, తాళ్లు కడలిలో విడిచిపెట్టడం వల్ల జీవులకు విఘాతం కలుగుతుందన్నారు.

నేటి నుంచి స్వచ్ఛాంధ్ర అవార్డుల ఎంపిక

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవార్డుల ఎంపిక కార్యక్రమం ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. ఏకో ఫ్రెండ్లీ ప్రాజెక్టు ఎగ్జిబిషన్, స్కూల్స్-చేతులు కడుగుకునే కార్యక్రమం, మొక్కలు నాటడం, పారిశుధ్యం, కెనాల్ బండ్ క్లీనింగ్, టెర్రస్‌గార్డెన్, శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహించి అవార్డులకు ఎంపిక చేస్తామని అయన వెల్లడించారు.

పంటుకు రూట్ అనుమతి తప్పనిసరి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):నదిలో ప్రయాణించే బోటు, పంటు, లాంచీ వంటి వాటికి లైసెన్స్‌లతోపాటు రూట్ అనుమతి ఉండాలని ధవళేశ్వరం బోటు సూపరింటెండెంట్ మూర్తిరాజు అన్నారు. మంగళవారం నరసాపురం ఏటిగట్టు శాఖ ఏఈ పవన్ ఎంపీడీవో వీరభద్ర రావుతో కలిసి మాధవాయిపాలెం రేవును సందర్శించారు. పంటు ఫిట్‌నెస్ పరిశీలించారు. రూట్ అనుమతిని చూపించమన్నారు. మండల పరిషత్ తమకు ఎటువంటి పత్రాలు ఇవ్వలేదని నిర్వాహకులు చెప్పారు. ఎంపీడీవో కూడా ఈ విషయం తమకు తెలియదని చెప్పారు. మూడు రోజుల్లో అనుమతి తీసుకోకపోతే రాకపోకల్ని నిలిపివేస్తామన్నారు.

ఏఎంసీలు రైతులకు చేయూతనివ్వాలి

భీమవరం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో మంత్రులు, ఎమ్మెల్యేలు


భీమవరం ఏఎంసీ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో రైతులే కీలకమని, వారికి చేయూతనిచ్చేలా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలు కృషి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. మంగళవారం భీమవరం ఏఎం సీ ప్రాంగణంలో ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సభాధ్యక్షుడు, ఎమ్మెల్యే అంజిబాబు నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్‌పర్సన్‌గా కలిదిండి సుజాత రామచంద్రరాజు, వైస్ చైర్మన్‌గా బండి రమేష్ కుమార్, 13 మంది డైరెక్టర్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర మంత్రి వర్మ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ భీమవరం ఏఎంసీని నూతన పాలక మండలి అభివృద్ధి పథంలో నడిపించాలని, కూటమి ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు వివరించాలన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో జీర్ణించుకోలేని జగన్ వైసీపీ సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ఫేక్ ప్రచారాలు చేయడంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారని తెలిపారు. భీమవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతా రామలక్ష్మి, ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మహిళా ఆర్థిక సహకార కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత, ఏపీ భవన, ఇతర కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వలవల మల్లికార్జునరావు, నరసాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పొత్తూరి రామాంజనేయరాజు, ఏపీఐఐసీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ళ నాగేశ్వరరావు, వేంద్ర శ్రీనివాస్, జనసేన జిల్లా కార్యదర్శి పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం..

ఏలూరులో ముమ్మర ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంపికైన 1063 మంది అభ్యర్థులకు ఈ నెల 19న అమరావతిలో నిర్వహించనున్న ఉద్యోగ నియామకపత్రాల అందజేతకు తరలించడానికి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు వేగవంతం చేసింది. ఏలూరులో ఇప్పటికే ఎంపిక చేసిన పాఠశాలలను అభ్యర్థుల వారీగా కేటాయించే పనులను మంగళవారం ప్రారంభించారు. అభ్యర్థితో పాటు, మరొకరిని సహాయకునిగా వెంట తెచ్చుకునేందుకు అనుమతించడంతో ఇద్దరికీ వసతి, ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. మహిళా, పురుష అభ్యర్థులకు వేర్వేరుగా పాఠశాలలను కేటాయించారు. సంబంధిత పాఠశాల హెచ్‌ఎంనే ఏర్పాట్ల పర్యవేక్షణకు ఇన్‌చార్జిగా నియమించి, స్కూలులో పని చేస్తున్న ఇద్దరు టీచర్లను, నగరపాలక సంస్థ పాఠశాలల్లో సర్‌ప్లస్‌గా వున్న క్లస్టర్ టీచర్లను హెచ్‌ఎంకు సహాయకులుగా నియమిస్తున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు 24 మంది చొప్పున విభజించి, వారి సహాయకులతో సహా మొత్తం 48 మందికి వసతి, రాత్రి బస, భోజన సౌకర్యా లను కల్పించే బాధ్యతల నిమిత్తం ఒక ఎంఈవో, నలుగురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులతో కూడిన బృందాలు మొత్తం 42 టీంలు ఇప్పటికే పని చేయడం ప్రారంభించాయి. ఈ టీంలు తమకు కేటాయించిన అభ్యర్థులకు ఫోన్‌చేసి వివరాలు సేకరించడం, 18న సాయంత్రం 4 గంటలకు సంబంధిత స్కూలుకు వారు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడటం, గుర్తింపు కార్డులందజేత, వసతి, మరుసటిరోజు ఉదయం 10 గంటలకు ఏలూరు నుంచి అమరావతికి బయలుదేరేలా చూడటం, ప్రధాన వేదిక ప్రాంగణంలోకి తీసుకెళ్లడం ఇలా బాధ్యతలన్నీ ఈ టీంలే చూసుకునేలా కార్యనిర్దేశనం చేశారు. మరోవైపు అభ్యర్థులు బసచేసే పాఠశాలల్లో వసతుల కల్పనకు ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్‌కు, పోలీసు భద్రత కోసం అధికారులకు సమాచారం ఇచ్చారు. అభ్యర్థులు, వారి సహాయకులకు ఆహారమందించేందుకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి పాఠశాలలో అత్యవసర వైద్య సేవల నిమిత్తం ఏఎన్‌ఎంలను నియమించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను అభ్యర్థించారు.

అభ్యర్థులకు వెసులుబాటు

ఏలూరులో తమకు కేటాయించిన పాఠశాలల్లో 18న రాత్రి బస చేయడానికి అభ్యర్థులెవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే వెసులుబాటు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే అభ్యర్థులంతా తొలుత తమకు కేటాయించిన పాఠశాలకు వెళ్లి అక్కడ కౌంటర్‌లో తాము హాజరైనట్టుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఐడీ కార్డును పొందటం తప్పనిసరి. ఆ తర్వాతే అక్కడున్న అధికారులకు తెలియజేసి బయటకు వెళ్లాలి. ఇలా సొంతంగా వసతి ఏర్పాట్లు చేసుకున్న అభ్యర్థులంతా 19న ఉదయం 8 గంటలకల్లా నిర్దేశిత పాఠశాల వేదిక వద్దకు విధిగా చేరుకోవాలి. ఇక పాఠశాల తరగతి గదుల్లో 18న రాత్రి నిద్రించేందుకు వీలుగా అభ్యర్థులు తమ వెంట బ్లాంకెట్స్ తెచ్చుకోవడం మంచిదని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

హైదరాబాద్‌కు మూడు రైళ్లు

నరసాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నరసాపురం నుంచి హైదరాబాద్ మధ్య రైళ్ల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం లింగంపల్లి, నాగర్ సోల్ మాత్రమే నడుస్తున్నాయి. తాజాగా మైసూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ జత అయింది. ఈ రైలు సోమ, మంగళవారాల్లో నరసాపురం నుంచి సికింద్రాబాద్ మీదుగా నడవనుంది. ఉదయం 11.30కు బయలుదేరి సికింద్రా బాద్‌కు రాత్రి 10 గంటలకు చేరుతుంది. లింగంపల్లి ప్రతి రోజు సాయంత్రం 6.55 గంటలకు, నాగర్‌సోల్ ప్రతి రోజు ఉదయం 11.20 గంటలకు నరసాపురం నుంచి బయలుదేరుతున్నాయి. వీటిలో లింగంపల్లి గుంటూరు మీదుగా నడుస్తోంది. నాగర్‌సోల్ శని, ఆది వారాల్లో గుంటూరు మీదుగా, మిగిలిన ఐదు రోజులు వరంగల్ మీదుగా హైదరాబాద్ వెళుతుంది. ప్రస్తుతం మైసూర్ ఎక్స్‌ప్రెస్ వారంలో 2 రోజులు గుంటూరు మీదుగా వెళుతుంది.

నిలకడగా పొగాకు ధరలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):మంగళవారం ఎన్‌ఎల్‌ఎస్ పరిధిలో ఉన్న 5 వేలం కేంద్రాల్లో పొగాకు ధరలు: దేవరపల్లి వేలం కేంద్రంలో కిలో క్వాలిటీ పొగాకు గరిష్ట ధర రూ.430, కనిష్ట ధర రూ.100, సరాసరి ధర 309.29, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో వరుసగా రూ.429, రూ.200, 351.54, జంగారెడ్డిగూడెం కేంద్రం-2లో రూ.430, రూ.200, 374.79, కొయ్యలగూడెం రూ.429, రూ.200, 371.35, గోపాలపురం గరిష్ట ధర రూ.429, కనిష్ట ధర రూ.200, సరాసరి ధర-331.11 గా ఉంది. గత వారం రోజులుగా పొగాకు ధరల్లో పెరుగుదల కనిపిస్తూనే ఉంది.


హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు వర్మ, నిమ్మల తదితరులు

అత్యాధునిక వసతులతో మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ ప్రారంభం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో (పూలపల్లి) అత్యాధునిక వసతులతో కూడిన మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్‌ను కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మంగళవారం ప్రారంభించారు. చైతన్య సంస్థల వ్యవస్థాపక చైర్మన్, కిమ్స్, మెడ్ యునైటెడ్ ఆసుపత్రుల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిమ్స్ వైద్య సంస్థలు, మెడ్ యునైటెడ్ ఆస్పత్రుల ఎండీ కె.రవికిరణ్‌వర్మ ఆధ్వర్యంలో జరిగిన సభలో మంత్రి వర్మ మాట్లాడుతూ చైతన్యరాజు ఆధ్వర్యంలో పాలకొల్లులో అత్యాధునిక మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభం ఈ ప్రాంతానికి శుభ పరిణామమన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఇకపై గుండె నొప్పి వైద్యానికి ఇతర ప్రాంతాలకు వెళ్లనక్కర లేదని, ఆధునిక సౌకర్యాలతోపాటు బ్రెయిన్ స్ట్రోక్‌కు అడ్డుకట్ట వేసే న్యూరాలజీ సేవలు పాలకొల్లులో అందుబాటులోకి వచ్చాయని, గతంలో చేసిన విజ్ఞప్తి మేరకు చైతన్యరాజు, రవికిరణ్ వర్మ పాలకొల్లులో ఈ ఆసుపత్రి నిర్మించారన్నారు. చైతన్యరాజు మాట్లాడుతూ ఏఐ ఆధారిత పరికరాలు, ఆరోగ్య పరీక్షలు మెడ్ యునైటెడ్ ఆసుపత్రిలో లభించనున్నాయన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య అవసరాన్ని బట్టి ఇక్కడ సేవలు అందుబాటులో ఉంచామన్నారు. ఎండీ రవికిరణ్ వర్మ మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి వారికి తక్కువ ధరకు వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. అమలాపురం, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల సుబ్బరాజు ఎమ్మెల్సీలు రాజశేఖర్, బి.గోపిమూర్తి, కె.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్, మేకా శేషు బాబు, మాజీ మంత్రి పీతల సుజాత, పి.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.


లక్కీ డ్రా విజేతలను డ్రా ద్వారా ఎంపిక చేస్తున్న నిర్వాహకులు

వేగా జ్యువెలర్స్ ఆషాఢం లక్కీ డ్రా విజేతలు

ఏలూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ఏలూరు వేగా జ్యువెలర్స్ షోరూమ్‌లో ఆషాఢమాసం సందర్భంగా నిర్వహించిన లక్కీ డిప్‌లో గెలుపొందిన విజేతలను యాజమాన్యం మంగళవారం ప్రకటించింది. వేగా జ్యువెలర్స్ ప్రత్యేక సందర్భాలలో ఆభరణాలు కొనుగోలు చేసిన ఖాతాదారులకు లక్కీ కూపన్లు జారీచేసింది. వీటిని డ్రా తీసి వి.వీరభద్రరావు(జగ్గవరం), ఎస్.సతీష్‌కుమార్(ఏలూరు), జి.రమేష్(ఏలూరు), వి.సత్యప్రియ(దుగ్గిరాల), బి.శారద(ఏలూరు)లను విజేతలుగా ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ.రెండు లక్షల విలువైన బంగారు/డైమండ్ నెక్లెస్‌లను బహుమతిగా అందజేసినట్టు సంస్థ చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వనమా తెలిపారు. వేగా జ్యువెలర్స్‌కు సినీనటుడు నందమూరి బాలకృష్ణ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండడం తమకెంతో గర్వకారణమన్నారు. తమ అన్ని షోరూమ్‌లలో రాబోయే దసరా, దీపావళి పండుగలు, వివాహాది వేడుకల కోసం సరికొత్త డిజైన్లలో ఆభరణాలను విస్తృత శ్రేణుల్లో ఖాతాదారులకు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.


ఆందోళన చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

కులం పేరుతో దూషించారంటూ ఆందోళన

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కులంపేరుతో దూషించిన తన భర్తకు వెంటనే క్షమాపణలు చెప్పాలంటూ ఓ మహిళ నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి మిఠాయి దుకాణం ముందు ఆందోళనకు దిగిన ఘటన ఏలూరులో మంగళవారం చోటు చేసుకుంది.రంబా బాల రాజకుమారి అనే యువతి నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రంబా రాజాను 1998లో కులాంతర వివాహం కులాంతర వివాహం చేసుకుంది. తాను కులాంతర వివాహం చేసుకున్న కారణంగా కుటుంబ సభ్యులెవ్వరూ తనతో మాట్లాడటం లేదని, ఆస్తుల పంపకం జరగకముందే తన తండ్రి చనిపోయాడంటూ రాజకుమారి తెలిపింది. ఇటీవల ఆస్తుల పంపకం నిమిత్తం తన సోదరుడు తులసి కుమార్ పిలిచి అవమానించాడంటూ వాపోయింది. ఆస్తిలో వాటా పంచేది లేదంటూ తన భర్తను కులంపేరుతో అవమానించారంటూ వాపోయింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం మెయిన్ బజార్‌లో రాజకుమారి సోదరుడు నిర్వహిస్తున్న స్వీట్ దుకాణం వద్ద నాయీ బ్రాహ్మణ సంఘాల నాయకులతో కలిసి క్షమాపణ చెప్పాలంటూ నిరసన తెలిపారు. క్షమాపణ చెప్పకపోవడంతో బాధితులు ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుల దూషణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. రంబా శ్రీను, తాడివలస పవన్ కుమార్, భాస్కర్, ఈ శ్రీను, వీరస్వామి, కె.లాలు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి ఒక ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనంతో పాటు చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని,లారీ యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. సతీశ్ తెలిపారు.

మద్యం మత్తులో కాలువలో పడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రమాద వశాత్తు పడమర లాకుల్లో పడి కొట్టుకుపోయి మృతి చెందాడు. ఏలూరు రూరల్ పరిధిలోని గ్రీన్ సిటీ ప్రాంతానికి చెందిన కోట్ల ప్రసాద్(48) కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. మద్యానికి బానిసవడంతో వివాహం చేసుకోకుండా ఒంటరిగా ఉండిపోయాడు. మంగళవారం మధ్యాహ్నం మద్యం తాగి పడమరలాకుల వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయాడు. అతడి మృత దేహం కొత్తూరు జూట్‌మిల్లు వద్ద లభించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రూరల్ పోలీసులు స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ముసునూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ఒక ప్రేమ జంట సోమవారం రాత్రి ముసునూరు పోలీసులను ఆశ్రయించింది. రమణక్కపేటకు చెందిన చేకూరి అనిల్, చాట్రాయికి చెందిన నవరం జయషాలిని కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి వివాహానికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో 15వ తేదీన రాత్రి వీరు వలసపల్లి అడ్డరోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించారు. వీరు మేజర్లు కావడంతో మంగళవారం వీరి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి యువకుడి వెంట యువతిని పంపినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

హత్య కేసులో ఒకరికి నాలుగేళ్ల జైలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ తస్కరించాడని ప్రశ్నించిన వ్యక్తిని కర్రతో చావబాదడంతో ఆ వ్యక్తి మృతి చెందాడు. దీంతో కొట్టిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఏలూరులోని 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీఎస్ మురళీకృష్ణ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామానికి చెందిన ఇస్సాకు 2024 జులై 4వ తేదీ రాత్రి ఆ గ్రామ రామాలయం ఎదురుగా ఉన్న మండపంలో మద్యం మత్తులో పడుకున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన మద్దిపట్ల నాగేశ్వరరావు అలియాస్ అబ్బులు(58) వచ్చి అక్కడే ఉన్నాడు. ఇస్సాకు సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో అబ్బులు తీశాడని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన అబ్బులు కర్రతో చితకబాదాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అబ్బులు పారిపోవడంతో ఈ ఘటనపై అప్పటి తడికలపూడి ఎస్ఐ జయబాబు కేసు నమోదు చేసి మద్దిపట్ల నాగేశ్వరరావును అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీలు డి.వి.రామాంజనేయులు, చింతమనేని రమేశ్‌లు వాదించారు. ప్రాసిక్యూషన్‌కు కోర్టు మానిటరింగ్ సెల్ హెచ్.సి. కెఎస్ఎన్. మూర్తి, ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఏఎస్ఐ సిసిలి,ఏఎస్ఐ రుక్మంగధరావు, జంగారెడ్డిగూడెం సీఐ ఎం.వి.శుభాశ్, తడికలపూడి ఎస్ఐ చెన్నారావు, కోర్టు హెచ్.సి. రఫీలు సహకరించారు.

మునిసిపల్ స్కూల్లో విద్యార్థిపై దాడి


దాడిఘటనపై ఆరా తీస్తున్న పోలీసులు

నరసాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పీచుపాలెం మునిసిపల్ హైస్కూల్లో మంగళవారం దారుణం చోటు చేసుకుంది. పదో తరగతి చదువుతున్న సాయి అనే విద్యార్థిని తోటి విద్యార్థి తండ్రి, అతడి సోదరుడు, తాత కలిసి చితకబాదారు. దెబ్బలకు తాళలేక సాయి స్పృహ కోల్పోయి కుప్పకూలాడు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం రేచల్ సుజాత తరగతి గదిలోకి వెళ్లి సాయిపై దాడి చేస్తున్న ముగ్గురిని అడ్డుకుంది. వెంటనే విద్యార్థి మొహంపై నీళ్లు చల్లడంతో కొద్దిసేపటికి సాయి స్పృహలోకి వచ్చాడు. వెంటనే ఆమె తల్లితండ్రులకు సమాచారం ఇచ్చి సాయిని ప్రభుత్వ అస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రస్తుతం సాయి ఆరోగ్యం నిలకడగా ఉంది. సాయి తల్లిదండ్రులు స్కూల్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు స్కూల్ వద్దకు చేరి ఆరా తీశారు. బాధిత విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తామని చెప్పారు. సాయంత్రం ఎంఈవోలు పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్‌లు స్కూల్‌కు వెళ్లి తోటి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. ఘర్షణకు గల కారణాలపై ఆరా తీశారు. ఎంఈవో మాట్లాడుతూ గాయపడిన సాయి మరో విద్యార్థి రమేశ్ అదే స్కూల్లో చదువుతున్నారని అన్నారు. వీరిద్దరి మధ్య స్కూల్ బయట ఘర్షణ జరిగిందని, ఈ విషయపై రమేశ్ తల్లిదండ్రులకు చెప్పడంతో వారంతా వచ్చి సాయిని కొట్టినట్టు ప్రాథమికంగా తెలిసిందన్నారు.

ఇద్దరు బాలికల మిస్సింగ్.. ఛేదించిన పోలీసులు

భీమవరం క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయిన ఇద్దరు బాలికల మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలో భీమవరం వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. చిన అప్పారావుతోటకు చెందిన 18, 16 సంవత్సరాల ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఈ నెల 15వ తేదీ రాత్రి 7.30 గంటల సమయంలో ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. అయితే అదే రోజు అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో బాలికల తల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసిన గంటల వ్యవధిలోనే ఆ ఇద్దరు బాలికలు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్నట్టు గుర్తించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి,డీఎస్పీ జయసూర్య ఆధ్వ ర్యంలో సీఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్ కుమార్ ఆ ధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశారు. ఇద్దరు బాలికలను గుర్తించేందుకు అర్ధరాతి ఒంటి గంట సమయంలో సెల్‌ఫోన్ లోకేషన్ సాయం తో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలో ఉన్నట్టు గుర్తించారు.వెంటనే అక్కడి పోలీసుల సహకారంతో వారిని భీమవరం తీసుకొచ్చారు. తమ బిడ్డలను క్షేమంగా ఇంటికి తీసుకువచ్చి అప్పగించిన భీమవరం వన్‌టౌన్ పోలీసులకు, సిబ్బందికి ఆ బాలికల తల్లి, బంధువు లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ జయసూర్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను అనుక్షణం గమనిస్తూ ఉండాలని, లేకపోతే చిన్న వయస్సులోనే సెల్ ఫోన్ల రూపంలో టెక్నాలజీ అందుబాటులో ఉండటంతో వారు ప్రేమ,పెళ్లి పేరుతో పారిపోతున్నారన్నారు.కావున తల్లి దండ్రులు పిల్లలను అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకోవాలని, ఫోన్‌లో వారు ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలన్నారు. తప్పు దారిలో వెళితే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు.


గోతుల కారణంగా బోల్తా కొట్టిన వ్యాను

అదుపు తప్పి వ్యాను బోల్తా

కామవరపుకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం రహదారి గోతులమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం ఒక చిన్న కారు కొత్తూరు చెక్ పోస్టు సమీపంలో బోల్తా పడిన విషయం తెలిసిందే. మంగళవారం వడ్లపల్లి వద్ద మరో వ్యాను అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాద సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విషం తిని తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వివాహిత మంగళవారం ఉదయం మృతి చెందింది. కలిదిండి మండలం తాడినాడ గ్రామానికి చెందిన మద్దిరాల స్వాతి(23) ఈ నెల 14వ తేదీన విషం తింది. అప్పటి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

లింగపాలెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కట్నం కోసం భర్త తనను వేధిస్తున్నాడంటూ ఓ వివాహిత(23) పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని అనపనేనివారిగూడెం గ్రామానికి చెందిన మహిళకు ఏలూరుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. మూడేళ్లుగా తనను కట్నం కోసం వేధిస్తున్నాడంటూ ధర్మాజీగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్.ఐ. వెంకన్న తెలిపారు.

తల్లి, కుమార్తెల అదృశ్యం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సోదరుడి ఇంటికి వెళ్తున్నామని ఒక మహిళ తన ఇద్దరు కుమార్తెలను తీసుకెళ్లి మళ్లీ కనిపించలేదు. ఆమె ఆచూకీ కనిపించకపోవడంతో భర్త ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు కొబ్బరితోట రామాలయం ప్రాంతానికి చెందిన నందం లోకేష్ కుమార్ భార్య నందం సుబ్బలక్ష్మి(35), కుమార్తెలు నందం చాటిత శ్రీ(13), నందం బావన రేజా(10)లు కలిసి సుబ్బలక్ష్మి సోదరుడి ఇంటికి వెళ్తానని ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు బయల్దేరి వెళ్లారు. వారు అప్పటి నుంచి కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ కానరాకపోవడంతో లోకేష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలి

ఏలూరురూరల్ , సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసే అధికారులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని జిల్లా సమాచార పౌరసంబంధాధికారి యు.సురేంద్రనాద్ అన్నారు. సమాచార శాఖలో జిల్లా పౌరసంబంధాధికారిగా పనిచేస్తు పదోన్నతిపై రాజమహేంద్రవరం బదిలీ అయిన ఆర్‌వీఎస్ రామచంద్రరావును స్థానిక డీపీఆర్‌వో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సి.హెచ్.దుర్గాప్రసాద్, వి.సూపర్‌వైజర్‌సిహెచ్ శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మి, సౌరి, ప్రసాద్, బాబూరావు, గంగాధర్, సంధ్య, రామారావు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఏపీ ఎన్‌జీవో సంఘాన్ని కలిసిన సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ -5(డిజిటల్ అసిస్టెంట్లు)కు సీనియార్టీ జాబితా ప్రకారం పదోన్నతులు కల్పించాలని మంగళవారం ఏలూరులో ఏపీ ఎన్‌జీవో సంఘాన్ని కలిశారు. పదోన్నతుల విషయమై డీపీవో, కలెక్టర్‌కు అర్జీ ఇవ్వాలన్నారు. ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విషయం గతంలో జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లామని, మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

మహిళల కోసం నేటి నుంచి వైద్య శిబిరాలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఈ నెల 17నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు రెండు వారాల పాటు స్వస్త్ నారి సశక్తి అభియాన్(ఆరోగ్యవంతమైన మహిళ - శక్తివంతమైన కుటుంబం) అనే సమగ్ర ఆరోగ్య ప్రచార్, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి డాక్టరు బి.పాల్‌సతీశ్ కుమార్ తెలిపారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేయడమైందన్నారు. ఈ మేరకు ప్రత్యేక వైద్య శిబిరాలను వైద్యనిపుణులు, పారా మెడికల్ సిబ్బందిచే నిర్వహించడం జరుగుతుందన్నారు. అయుష్మాన్ కార్డులు అందించడం, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కావున జిల్లా వ్యాప్తంగా జరిగే వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సతీశ్ కుమార్ కోరారు.

లింగపాలెంలో నేడు ప్రత్యేక వైద్య శిబిరం

లింగపాలెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరగనున్న స్వస్త్‌నారీ సశక్తి పరివార్ అభియాన్ మహిళల ఆరోగ్య స్క్రీనింగ్ అండ్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఉదయం ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రారంభించనున్నట్టు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ శిబిరంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని, వ్యాధులపై మహిళలకు ప్రత్యేక అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్టు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ శిబిరాన్ని మండలంలోని బాలికలు, యువతులు, మహిళలంతా వినియోగించుకోవాలన్నారు.

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం గుడివాక లంక పాఠశాలలో రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ప్రభుత్వ అధినేతల మాటల్లో కనపించే ప్రేమ చేతల్లో కనిపించడం లేదన్నారు. 12వ పి.ఆర్.సి. కమిషనర్ రాజీనామా చేసి 15 నెలలు గడిచిన మరొకరిని నియమించలేదనీ, కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వలేదన్నారు. ఆర్థిక, విద్యారంగం సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సాల్మన్, రవిప్రసాద్, దేవిప్రసాద్, జనార్దన్‌రావు, దాస్ పాల్గొన్నారు.

సీఎం ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్న నిర్ణయంపై హర్షం ప్రకటించారు. సీఎం ఆశయాలు నెరవేర్చడంలో కొంత మంది ఉన్నతాధికారులు తప్పుడు సలహాలిచ్చి గత ప్రభుత్వంలో సేకరించిన అసంబద్ధత సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోల లాగిన్లుకు పంపించి మరలా ఆ తప్పుడు డాటాపై ఆధారాలు సేకరించి సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇవ్వాలని వీఆర్వోల లాగిన్లుకు పంపించారన్నారు. శాశ్వత కుల ధృవీకరణ పత్రాల ద్వారా విద్యార్థులకు, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

'ఛలో విజయవాడ'ను జయప్రదం చేయండి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ఎన్నికల హామీని అమలు చేయాలంటూ ఈ నెల 18న ఆటో మోటార్ డ్రైవర్లు చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి.రమణ పిలుపునిచ్చారు. మంగళవారం దొరమామిడిలో ఐక్య ఆటో మోటారు కార్మిక సంఘాలు ముద్రించిన ఛలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఉచిత బస్సు వలన ఆటో, టాటా ఏస్ డ్రైవర్లు ఉపాధిని కోల్పోయారని, ప్రభుత్వం ఇచ్చే రూ.15 వేలు ఎటూ సరిపోవన్నారు. అద్దె ఆటోలు నడుపుతూ జీవనోపాధి పొందుతున్న డ్రైవర్లకు పథకం వర్తింపజేయాలన్నారు. రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కె.సురేశ్, కె.శ్రీను, ప్రసాద్, రమేశ్, బుచ్చిరాజు, భూషణం పాల్గొన్నారు.

మాల మహాసేన జాతీయ కార్యదర్శిగా స్వామి దాసు



పెదవేగి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మాల మహాసేన జాతీయ కార్యదర్శిగా పెదవేగికి చెందిన మద్దుల స్వామిదాసు ఎన్నికయ్యారు. ఈ మేరకు మాల మహా సేన వ్యవస్థాపక అధ్యక్షుడు అలగ రవికుమార్ నియామకపత్రాన్ని స్వామిదాసుకు అందజేశారు. ఈ సందర్భంగా స్వామిదాసును మాలమహాసేన నాయకులు ఘనంగా సత్కరించారు. స్వామిదాసు మాట్లాడుతూ మాలల సంక్షేమం, అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. అన్నింటా వెనుకబడిన మాలల అభివృద్ధి చెందాలంటే అక్షరాస్యత ఒక్కటే మార్గమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక పరిపుష్టే సాధించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏఎస్‌ఆర్ స్టేడియం వద్ద ముస్లిం షాదిఖానాలో మెప్మా ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలను పూర్తి స్థాయిలో బలోపేతం చేయనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ముందు చూపుతో మహిళా ఆర్థిక స్వవలంభనే ధ్యేయంగా తక్కువ వడ్డీకే లోన్లు ఇస్తున్నామన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్‌ఎంఆర్ పెదబాబు, రెడ్డి నాగరాజు, నెరుసు గంగరాజు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

చింతలపూడి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధ సంఘం జిల్లా కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు, పలువురు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న కార్మికులు తమకు రావాల్సిన పథకాల కోసం పెట్టుకున్న సుమారు 50 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, 2019 సంవత్సరంలో గత ప్రభుత్వం హయాంలో సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ జీవో జారీ చేయడం వలన కార్మికులు క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు.వాటిని పరిష్కరించి కార్మికుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్త అర్జీల్లో భాగంగా ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు.

తొలగించిన వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తొలగించిన వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వీవోఏల ఆన్‌లైన్ వర్క్‌ల పేరుతో వేధింపులు ఆపాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వెలుగు వివోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం(సీఐటీయూ)ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న వీవోఏలను రాజకీయ వేధింపులకు గురి చేస్తూ తొలగించాలని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నాయకులు ఎం.ఇసాక్, జి.గోపి, కుమార్‌లు మద్దతు ప్రకటించారు. యూనియన్ జిల్లా నాయకులు ఎం.ఆమని, మరియమ్మ, బి.ఆదిలక్ష్మి, డి.కుమారి, ఇందిర, టి.విమల, ఎ.రాజ్యలక్ష్మి, రాధారాణి, నాగ దుర్గాదేవి, సి.హెచ్.జ్యోతి పాల్గొన్నారు.

చర్చిద్దాం రండి

(5వ పేజీ తరువాయి)

వైసీపీ పాలనలో రూ.125 కోట్లు ఖర్చు పెట్టారు. కూటమి ప్రభుత్వం రూ.80 కోట్లు ఖర్చుపెట్టి పనులు వేగవంతం చేస్తోంది. ఇంకా రూ.325 కోట్లతో భవన నిర్మాణాలు చేపట్టాల్సి వుంది. ఈ పనులన్నీ ఏడాదిన్నరలో పూర్తవుతాయి. తమ ప్రభుత్వం వచ్చాకే అన్ని సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఏటిగట్టు ప్రాంతంలో ఎకరం 50 సెంట్లు, సాంఘిక సంక్షేమ హాస్టల్స్ భవనాల ప్రాంతం ఎకరం 12 సెంట్లు భూమిని వైద్య కళాశాలకు అప్పగిస్తూ చర్యలు తీసుకున్నాం. ఆ భవనాల్లో హాస్టల్స్ నిర్మిస్తాం. వైసీపీ నాయకులు సిగ్గు ఎగ్గు లేకుండా ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల అన్ని సదుపాయాలతో తామే నిర్మించామంటూ తాత్కాలిక భవనం వద్ద కేక్ కట్ చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, కో ఆప్షన్ మెంబర్ చోడే వెంకటరత్నం, బెల్లంకొండ కిశోర్, నెర్సు గంగరాజు, పూజారి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావద్దు

- మాదకద్రవ్యాల విషప్రభావంపై అవగాహన
- విద్యార్థులు లక్ష్య సాధన దిశగా సాగాలి
- ఏఎస్పీ సూర్యచంద్రరావు సూచన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ సూచర్యచంద్రరావు

పెదపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాలు మనిషి జీవితాన్ని నాశనం చేస్తాయని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు తెలిపారు. ఏలూరు ఈగల్ టీం ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో అనే అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఎస్పీ సూర్యచంద్రరావు పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని నిరంతరం వాటి సాధన దిశగా శ్రమించాలని, చెడు అలవాట్లు, వ్యసనాలు జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు డ్రగ్స్ సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత అంశాలపై వివరించి సూచనలు చేశారు. ఈగల్ ఆర్ఎస్ఐ బి.ఉదయభాస్కర్ మాట్లాడుతూ గంజాయి అలవాటు అయ్యే విధానం, అనంతరం తలెత్తే చెడు పరిణామాలను వివరించారు. కళాశాల ఎండీ కె.సాయిరోహిత్, ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.మురళీధరరావు పాల్గొన్నారు.

బాలభవన్‌లో బాలికలకు..

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం వల్ల దుష్ప్రభావాలపై స్థానిక వైఎస్సార్ నగర్ ప్రభుత్వ బాలభవన్‌లో బాలబాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. సైకాలజిస్టు అనూష మాట్లాడుతూ దురలవాటైన గంజాయి, సిగరెట్లు, ఆల్కాహాల్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్ మాట్లాడుతూ విద్యార్థులు ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లకు దూరంగా ఉండాలన్నారు. తల్లితండ్రులు కేవలం అమ్మాయిలకు మాత్రమే జాగ్రత్తలు చెబుతారని, అబ్బాయిలు చెడు వ్యసనాల బారినపడకుండా వారికదలికలు, స్నేహితులపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. బాలభవన్ ఇన్‌చార్జి ఆంజనేయులు, ఉపాధ్యాయులు పార్వతి, ధనలక్ష్మి, దయావతి పాల్గొన్నారు.

ఓజోన్ పొరను పరిరక్షించండి



సింగగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఓజోన్ డే కార్యక్రమాలు మంగళవారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో ఉత్సాహంగా జరిగాయి. ప్రాణకోటి మనుగడకు అత్యావశ్యకమైన ఓజోన్ పొర ప్రాముఖ్యతను వక్తలు విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సీఆర్‌ఆర్ పీజీ కళాశాల కెమిస్ట్రీ ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఓజోన్ పొర రక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలిపారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు రమేశ్, వెంకట్రావు, రాంబాబు, పరమేశ, సుశ్యలత, సుజాత పాల్గొన్నారు. సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామ రాజు అందజేశారు. మొక్కలను విరివిగా నాటడం, ఆర్గానిక్ ఎరువులను వినియోగించడం ద్వారా ఓజోన్ పొరను కాపాడుకోవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అధ్యాపకులు సతీశ్, రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపాధ్యాయుల అవగాహన

● లింగపాలెం: ఓజోన్ పొరను పరిరక్షించుకోవడానికి ఉన్న పలు మార్గాలను విద్యార్థులు తెలుసుకోవాలని సింగగూడెం మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. మండలంలోని సింగగూడెం మోడల్ స్కూల్లో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు ఓజోన్‌పొర దెబ్బతినడానికి గల కారణాలను ఓజోన్ పొరను పరిరక్షించుకోవడానికి ఉన్న పలు మార్గాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఏటా సెప్టెంబరు 16న ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. ఉపాధ్యాయులు ఎ.అప్పారావు, ఎం.రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ కె.విజయబాబు ఆదేశాలతో కళాశాల విద్య అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఎన్ఎస్ఎస్ విభాగం, కెమిస్ట్రీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణ ఆవశ్యకత గురించి వివరించారు. కెమిస్ట్రీ విభాగం అధ్యాపకురాలు ఎం.ఉషారాణి ఓజోన్ పొర విఘాతం వలన సకల జీవరాశికి కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఓజోన్ పొరపై పోస్టర్స్ విడుదల చేశారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు కె.ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, వి.రాజు, ఎం.విజయకృష్ణ పాల్గొన్నారు.

సమాజ సేవలో యువతదే కీలకపాత్ర

క్యాంపస్ క్లబ్ ఎన్నికలో లయన్స్ గవర్నర్ పాపారావు నాయుడు



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్నికైన సభ్యులు

పెదవేగి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో యువతదే కీలకపాత్ర అని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావునాయుడు అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో కళాశాల క్యాంపస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గంతో సీహెచ్ కృష్ణారావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాపారావు నాయుడు మాట్లాడుతూ యువత సమాజ సేవలో భాగం కావడం అభినందనీయమన్నారు. కొత్తగా ఎన్నికైన యువత సేవే లక్ష్యంగా తమవంతు కృషిని అందించాలని, అదే లయనిజమన్నారు. దంతవైద్య కళాశాల కన్సర్వేటివ్ ఎండో డోంటిక్స్ విభాగంలో ఇంట్రా ఓరల్ స్కానర్‌ను ప్రారంభించారు. కార్యవర్గ నూతన అధ్యక్షుడు చందు శ్రీకర్, కార్యదర్శి కీర్తన, కోశాధికారి ఘంటా రోహిత్, ఇతర సభ్యులతో సీహెచ్.కృష్ణంరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. చివరగా పదిమంది పేద మహిళలకు కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ ఆర్థిక సహకారంతో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ కాకరాల వేణుబాబు, ఎక్స్‌టెన్షన్ చైర్మన్ సీహెచ్.అవినాశ్ రాజు, సభ్యులు ఎ.అనిల్ కుమార్, ఎ.శేషకుమార్, కె.మురళి, లక్ష్మీనారాయణరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

- విద్యుత్ శాఖ జేఏసీ నాయకత్వం పిలుపు



ఐక్య నినాదాలు చేస్తున్న సంఘ నాయకులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఎస్ కృష్ణయ్య, కన్వీనర్ రఘువరెడ్డి, కోకన్వీనర్ కె.శేషారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉద్యమ సన్నాహక సమావేశం నిర్వహించారు. గత మూడేగా ట్రాన్స్‌కో, ఎనర్జీ, డిస్కం మేనేజ్మెంట్స్‌తో దఫ దఫాలుగా చర్చలు జరిపినా, మినిట్స్ రూపంలో అంగీకరించినా సమస్యల పరిష్కారంలో ఎటువంటి కార్యరూపం దాల్చ లేదన్నారు. కార్మిక సంఘాలు గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న సర్వీస్ నిబంధనలను ఏకపక్షంగా మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు కె.శ్రీనివాస్, యం గోపి, డిస్కమ్ జేఏసీ నేతలు భూక్యా నాగేశ్వరరావు, తురగా రామకృష్ణ, సి.హెచ్. సాయిబాబా, జిల్లా నాయకులు ఎం.రమేష్, వి.రాము, అబ్బాస్, మరియు కాంట్రాక్ట్ కార్మికుల నాయకులు యం బాలకాశీ, కె నాగరాజు, మణిపాల్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా అన్నదానాలు

పోలవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా పోలవరం మండల కేంద్రంలో మంగళవారం భారీ అన్నదానాలు నిర్వహించారు. పోలవరం పంచాయతీ నూతనగూడెం రామాలయం, బీసీ కాలనీ గణపతి ఆలయాల వద్ద భారీ అన్నదానాలు నిర్వహించారు.సుమారు మూడు వేల మందికి పైగా ఈ అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు ఆలయ కమిటీలు తెలిపాయి.

అప్పనవీడులో..

పెదపాడు: అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. దాత పేరు మీదుగా సుమారు 200 మంది అన్నదానం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారన్నారు. అలాగే మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక

చింతలపూడి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన ఆరుగురు వైసీపీ కార్యకర్తలు గ్రామ టీడీపీ కార్యదర్శి వెలగల వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ ఆరుగురికి టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలోకి రావడం ప్రధానం కాదని పార్టీకి, ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాలన్నారు.

నేడు జడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే పర్యటన

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసపురం, పేరంపేట, చక్రదేవరపల్లి, లక్కవరం, జంగారెడ్డిగూడెం పట్టణంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బుధవారం జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొనున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా బైనేరు వద్ద ఉన్న వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద పూజల్లో పాల్గొంటారు.



గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

నగరంలో శక్తి టీమ్ గస్తీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో శక్తి టీమ్ గస్తీ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివకిశోర్ ఆదేశాల మేరకు శక్తి టీమ్ మహిళా ఎస్ఐ నాగమణి వారి సభ్యులు కలిసి మంగళవారం ఉదయం నుంచి నగరంలో విస్తృతంగా గస్తీ నిర్వహించారు. బస్టాండ్‌లో మహిళలు ఎక్కువగా ఉండడంతో వారికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా గస్తీ నిర్వహించారు. అత్యవసర సమయాల్లో 112కు గాని లేదా 181కు ఫోన్ చేయాలన్నారు. శక్తి టీమ్ టోల్ ఫ్రీ నెంబర్ 79934 85111కు సమాచారం అందించాలని సూచించారు.

● భీమడోలు:బాలికలు, విద్యార్థులు, మహిళలపై వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని భీమడోలు సీఐ విల్సన్ అన్నారు. భీమడోలులోని పలు కళాశాలలు, బహిరంగ ప్రదేశాలు, కూడలి ప్రాంతాల్లో మంగళవారం శక్తి టీమ్ బృందాలు గస్తీ నిర్వహించాయి. భీమడోలు ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై ముగిసిన శిక్షణ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):అందరితో సత్సంబంధాలు కలిగి ముందుకు నడిపించే వాళ్లే సమర్థవంతమైన నాయకులని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు. కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన నాయకత్వ శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఆమె మాట్లాడుతూ టైం మేనేజ్‌మెంట్,గోల్ సెట్టింగ్, పాజిటివ్ థింకింగ్, సంభాషణ చాతుర్యం, వ్యక్తిత్వ వికాసంవంటి అంశాల ఆవశ్యకతను వివరించారు. సెయింట్ థెరిస్సా విద్యాసంస్థల మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు.రిసోర్స్ పర్సన్లుగా ముంబైకి చెందిన ఫోరం ఫర్ ఫ్రీ ఎంటర్‌ప్రైజెస్ ప్రతి నిధులు సచిన్ కామత్, క్లారిసా జతన్నాలు వ్యవహరించారు.

వ్యాస రచన, డిబేట్ జిల్లా పోటీల విజేతలు వీరే

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీఈఆర్టీ-వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన వ్యాసరచన, చర్చా గోష్ఠి(డిబేట్)జిల్లా స్థాయి పోటీల విజేతల జాబితాను జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు ప్రకటించారు. మొత్తం 23 మండలాల నుంచి విద్యార్థి బృందాలు హాజరయ్యాయని వివరించారు. వ్యాస రచన పోటీలో నిడమర్రు మండలం, చిననిండ్రకొలను జడ్పీ హైస్కూలు విద్యార్థినులు కె.రిషిత, కె.మహిమాసువర్ణరూప, సీహెచ్.దీవెన బృందానికి ప్రథమ, ముసునూరు ఏపీఆర్ స్కూలు విద్యార్థినులు ఎం.లక్ష్మి, ఎల్.అను, ఎం.చాందిని బృందానికి ద్వితీయ, మండవల్లి మండలం, కోరుకొల్లు జడ్పీ హైస్కూలు విద్యార్థినులు ఎల్.రుక్మిణీదేవి, ఎం.ఝాన్సీ స్వరూప, జి.సౌమ్య కీర్తి బృందానికి తృతీయ బహుమతులు లభించాయి. డిబేట్ పోటీలో జంగారెడ్డిగూడెం జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థినులు ఐ.ఎం.కుసుమ, ఎ.గ్రేసీ బృందానికి ప్రథమ, ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు విద్యార్థినులు వై.దివ్యశ్రీ, జి.లిఖిత బృందానికి ద్వితీయ, పెదపాడు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు యు.భవ్యశ్రీ, ఆర్.పావని, జె.విమిలీ బృందానికి తృతీయ బహుమతులు లభించాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బృందాలు ఆన్‌లైన్ విధానంలో రాష్ట్ర స్థాయిలో అక్టోబరు 16న వ్యాస రచన, 18న డిబేట్ పోటీల్లో పాల్గొంటాయని జిల్లా సైన్స్ ఆఫీసర్ తెలిపారు.

రైతులు పంటలు నమోదు చేయించుకోవాలి

లింగపాలెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాగు చేస్తున్న పంటలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని లింగపాలెం మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని ముడిచర్లలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పంట పొలాలు పరిశీలించారు. తెగుళ్ల నివారణపై పలు సూచనలు చేశారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ సాగు చేపట్టాలన్నారు. దీంతో పాటు రైతులు తమ పంటలను తప్పని సరిగా ఇ-పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. రావి వెంకటేశ్వరరావు, మోదుగు నాగేశ్వరరావు, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాయితీల ద్వారా ఉద్యాన పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం చిన్న సన్నకారు రైతుల్ని ప్రోత్సహిస్తోందని ఉద్యాన అధికారిని నవీనమాల అన్నారు. ఎంపీపీ కొర్స పోశమ్మ అధ్యక్షతన ఎంపీడీవో నిఖిల్‌మధుశరణ్ ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల మండల స్థాయి అధికారులు ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందజేసే సంక్షేమ పథకాలు వివరాలు వెల్లడించారు. త్వరలో మండలంలో మూడు పంచాయతీలు జీలుగుమిల్లి, దర్భగూడెం, ములగలంపల్లి గ్రేడ్-1గా గుర్తించారని దీంతో సిబ్బంది కొరత తీరడంతోపాటు పంచాయతీలు అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఎక్కువ నిధులు మంజూరు చేస్తుందని ఎంపీడీవో నిఖిల్ అన్నారు. తహసీల్దారు ఉదయ్‌భాస్కర్, ఎంఈవో కె.శ్రీనివాస్, ఏఈ రామాంజనేయులు,ఎక్సైజ్ ఎస్.ఐ. సుబ్రహ్మణ్యం, ఎలక్ట్రికల్ ఏఈ నాగేషు, ఏపీవో జాన్‌వెస్లీ, శ్రీవిద్య ఉన్నారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

నూజివీడు డ్వామా ఏపీడీగా శ్రీనివాస్

ఘనంగా సత్కరించిన కార్యాలయ సిబ్బంది

పెదవేగి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా సుదీర్ఘకాలం పనిచేసి, పదోన్నతిపై వెళ్తున్న పి.శ్రీనివాస్‌ను గ్రామ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. పెదవేగి ఎంపీడీవో రెండు పర్యాయాలు పనిచేసిన ఆయన పదోన్నతిపై డ్వామా ఏపీడీగా నూజివీడుకు బదిలీ అయ్యారు. పదోన్నతిపై వెళ్తున్న ఆయనను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో పెదవేగి మండలాభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందించానన్నారు. ఈ విషయంలో సిబ్బంది భాగస్వామ్యం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. కార్యాలయ ఏవో రవికుమార్, ఈవోపీఆర్డీ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ ఆలీ, కార్యదర్శులు కృష్ణంరాజు, ప్రసాద్, సాయికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

బుట్టాయగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగాల్సి ఉండగా కోరం లేక మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 2న జరగాల్సిన సమావేశం కోరం లేక మొదటిగా వాయిదా పడగా 16న సమావేశం ఉంటుందని అధికారులు ప్రకటించారు.మంగళవారం కూడా కోరం లేకపోవడంతో వాయిదా పడగా సమావేశం నిర్వహించే తేదీని మళ్లీ ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

ప్రిన్సిపాల్ హిమబిందుకు డాక్టరేట్

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్‌ఆర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కె.హిమబిందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. టీచింగ్ కాంపిటెన్సీ ఆఫ్ సెకండరీ స్కూల్ టీచర్స్ ఇన్ రిలేషన్ టు ఆక్యుపేషనల్ స్ట్రెస్ అండ్ జాబ్ శాటిస్ఫాక్షన్ అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆమెకు డాక్టరేట్ లభించింది. హిమబిందును సీఆర్‌ఆర్ విద్యా సంస్థల పాలకవర్గ కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కార్యవర్గం, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

డీఎల్‌పీవోగా సుబ్బరాయన్



జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం డీఎల్ పీవోగా సుబ్బరాయన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ద్వారకా తిరుమలలో డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన డీఎల్‌పీవో ప్రమోషన్‌తో ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎల్‌పీవో సుబ్బరాయన్ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు పగడం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు డీఎల్‌పీవో సుబ్బరాయన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా చిన్న పోలమ్మ సంబరం

చింతలపూడి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని వెలమపేటలో చిన్న పోలమ్మ సంబరం జరిపారు. అమ్మవారికి పూజలు జరిపి హారతులు ఇచ్చారు. గత పది రోజులుగా ముత్యాలమ్మ ఆలయ జాతర జరిపిన నిర్వాహకులు ముగింపుగా పోలమ్మ సంబరం జరిపారు. ఆ పేటలోని పలువురు భక్తులు పూజలు జరుపుకున్నారు.

వేలేరుపాడు ఎంపీడీవోగా శ్రీహరి



వేలేరుపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు రెగ్యులర్ ఎంపీడీవోగా ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీహరి నియమితులయ్యారు. బుట్టాయగూడెం ఈవోపీఆర్డీగా పనిచేస్తూ వేలేరుపాడు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీహరిని పదోన్నతిపై వేలేరుపాడు ఎంపీడీవోగా నియమించారు. పదేళ్లుగా ఈ మండలంలో ఈవోపీఆర్డీగా, ఇన్‌చార్జి ఎంపీడీవోగానూ విధులు నిర్వహించి పలుసార్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పథకాలు పొందారు.



ఆలయానికి రూ.5 లక్షల విరాళం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీనూకాలమ్మ వెండి చీర తయారీకి, ఆలయ అభివృద్ధి నిమిత్తం అమెరికాలోని టెక్సాస్‌లో ఉంటున్న పట్టణానికి చెందిన జంగా బాబూ రాజేంద్రప్రసాదరెడ్డి, సుష్మ, కుటుంబ సభ్యులు మంగళవారం రూ.5 లక్షల 1116 నగదును ఆలయ చైర్మన్ రాజాన పండుకు మంగళవారం అందజేశారు.దాత బాబూ రాజేంద్రప్రసాద్ రెడ్డి కుటుంబాన్ని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు గాలి నూకరాజు, పోలుపర్తి రాము, నౌడు సత్య నూకరాజు, ఆలయ మేనేజరు చిటికెన రాంబాబు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి పూజలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భాద్రపద మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపి సామూహికంగా హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల శ్రీనివాసాచార్యులు తొలుత స్వామివారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చి భక్తులకు దర్శనమిచ్చారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టండి

టి.నర్సాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాలసూర్య నారాయణ రాజు(సూరిబాబు) సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ దారబోయిన లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూరిబాబు మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా రోడ్ల సమస్య వలన ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటి అభివృద్ధికి అధికారులు, ప్రణాళికలు రూపొందించాలని కోరారు.

నేడు పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

ఆసక్తిగల భక్తులు పాల్గొనవచ్చన్న ఈవో

కైకలూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. ఎండోమెంట్ తనిఖీ అధికారుల పర్యవేక్షణలో ఈ లెక్కింపు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

నేడు మండల స్థాయి గేమ్స్‌పై సమావేశం

ముసునూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఆటల పోటీలపై బుధవారం ముసునూరు జడ్పీ పాఠశాలలో ఉదయం 10 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం డి.శైలజ తెలిపారు. జడ్పీ, గురుకుల బాలికల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎప్పుడు నిర్వహించాలి, విధి విధానాలపై చర్చించనున్నట్లు ఆమె తెలిపారు.

‘వేదిక’లో ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ పరిశీలన



ఆగిరిపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆగిరిపల్లి మండలం, ఈదర గ్రామ రైతు కట్టాల వెంకటేశ్వరరావు బొద్దనపల్లిలోని తన భూమికి సమీపంలోని రైతు ఫెన్సింగ్ వేసి దారి లేదని చెప్పడంతో, గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన నూజివీడు సబ్‌కలెక్టర్ బి. వినూత్న మంగళవారం పొలానికి వెళ్ళే దారిని పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ పి.ఎన్.వి ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ యూనస్, సర్వేయర్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నూజివీడు డ్వామా ఏపీడీగా శ్రీనివాస్

పెదవేగి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా సుదీర్ఘకాలం పనిచేసి, పదోన్నతిపై వెళ్తున్న పి.శ్రీనివాస్‌ను గ్రామ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. పెదవేగి ఎంపీడీవో రెండు పర్యాయాలు పనిచేసిన ఆయన పదోన్నతిపై డ్వామా ఏపీడీగా నూజివీడు బదిలీ అయ్యారు. పదోన్నతిపై వెళ్తున్న ఆయనను మంగళవారం ఘనంగా సత్కరించారు.



శ్రీశ్యామలాంబ ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

దసరా ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

కైకలూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి శ్రీచండీమహాయాగ సహిత శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల కోసం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ళు, కళామండపం వద్ద ప్రత్యేకంగా స్టేజీ ఏర్పాట్లు చేసి ఆలయాన్ని రంగులతో అలంకరిస్తున్నారు. చలువ పందిళ్ళకు విద్యుత్ దీపాలను ఏర్పాటుచేయడంతో పాటు ప్రధాన ముఖద్వారాల వద్ద ఆర్చ్ నిర్మాణాలను చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కె శేఖర్, నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాల ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కళామండపం వద్ద భారీ స్టేజీని ఈదురుగాలులు వీచినా, భారీవర్షాలు వచ్చినా ఏమీ కాకుండా ఉండేలా కట్టుదిట్టంగా ఏర్పాటు చేస్తున్నారు.

నేడు ప్రధాని పుట్టినరోజుకు భారీ ఏర్పాట్లు

కైకలూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలకు కైకలూరు నియోజకవర్గంలో ముమ్మరంగా ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగే ఈ వేడుకలకు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, కలిదిండి స్టేట్ బ్యాంక్ సెంటర్లో బీజేపీ జెండా ఆవిష్కరణ, ముదినేపల్లి ఆటోనగర్‌లో పేదలకు చీరలు పంపిణీ, మండవల్లి మండలం లింగాలలో పేదలకు దుస్తులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొనున్నారు. అలాగే ప్రధాని పుట్టినరోజు సందర్భంగా ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న మండవల్లి తరుగుమూలలోని స్థలాలకు ఇళ్ళపట్టాలను మండవల్లి నాగేంద్రస్వామి గుడివద్ద ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.



సింగరాయపాలెంలో టీడీపీ నేత చలమయ్య పుట్టిన రోజు వేడుకలు

ఘనంగా చలమయ్య పుట్టిన రోజు వేడుకలు

ముదినేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ముదినేపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుమల్లిలో చలమయ్య అభిమానులు కేక్‌కట్ చేసి అన్నదానం నిర్వహించారు. సింగరాయపాలెంలో టీడీపీ నాయకులు పరసా ఏడుకొండలు, శౌంరి నాగరాజు, బత్తుల గోపీ, జోగి రామకృష్ణ, మరీదు నాగరాజు, తదితరులు ఆధ్వర్యంలో చలమయ్య పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు.

పాఠశాలలను పరిశీలించిన ఎంఈవో

కలిదిండి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో-1 టి.రామలక్ష్మి అన్నారు. మంగళవారం మూల్లంక, సత్యనారాయణ నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల హాజరు, ఎఫ్ఏ-1 అసైన్‌మెంట్ బుక్‌లెట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంట శాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల విద్యా సామర్థ్యం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

పబ్లిక్ ప్రకటన

లెటర్ తేదీ : 15-09-2025

ఇందుమూలముగా గ్రామ ప్రజలకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా, ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, చెక్కపల్లి గ్రామం దివానం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయమును హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోనికి చేర్చి, చట్టం 30/87 నందలి సెక్షన్ 43 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయుట మరియు సెక్షన్ 6 ప్రకారం పబ్లికేషన్ చేయుటకుగాను పై దేవాలయము కమిటీ మరియు అర్చకుల అభ్యర్థన మేరకు నిర్ణయించుట జరిగినది.

కావున యిందు విషయమై మీకు ఏమైనా అభ్యంతరములు, ఆక్షేపణలు వున్న యెడల ఈ ప్రకటన ఇచ్చిన తేది నుండి పది రోజుల్లో లిఖిత పూర్వకముగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ ఆఫీసర్, దేవాదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు వారికి అందజేయవలెను.

సం/- **తనిఖీదారు**, దేవాదాయ ధర్మదాయశాఖ, గన్నవరం

పబ్లిక్ ప్రకటన

తేది : 06-09-2025

ఇందుమూలముగా గ్రామ ప్రజలకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా, ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, గుడిపాడు గ్రామంలోయున్న శ్రీ హనుమత్ సీతాలక్ష్మణ సమేత శ్రీ శ్రీ కోదండరామ ఆలయం స్వామి దేవస్థానం ను హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ పరిదిలోనికి చేర్చి, చట్టం 30/87 నందలి సెక్షన్ 43 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయుట మరియు సెక్షన్ 6 ప్రకారం పబ్లికేషన్ చేయుటకుగాను నిర్ణయించుట జరిగినది.

కావున యిందు విషయమై మీకు ఏమైనా అభ్యంతరములు, ఆక్షేపణలు వున్న యెడల ఈ ప్రకటన ఇచ్చిన తేది నుండి పది రోజుల్లో లిఖిత పూర్వకముగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ ఆఫీసర్, దేవాదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు వారికి అందజేయవలెను.

సం/- **తనిఖీదారు**, దేవాదాయ ధర్మదాయశాఖ, ఏలూరు, ఏలూరు జిల్లా.



కోతకు గురైన చాట్రాయి-నరసాపురం రహదారి మార్జిన్లు

తప్పుకునేదెలా..?

- యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు
- ధ్వంసమైన రహదారి మార్జిన్లు
- వాహనం ఎదురొస్తే మార్జిన్ సరిలేక పడిపోతున్న వాహనదారులు
- తక్షణం రహదారి మరమ్మతులకు ప్రజల వినతి

చాట్రాయి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-వెలగలపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి (వీవీ రోడ్డు) పరిధిలోని, నరసాపురం నుంచి తమ్మిలేరు ప్రాజెక్టు రెగ్యులేటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లు కోతకు గురికావటంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇది సింగిల్ లైను రోడ్డు కావటం, కొన్నేళ్ల నుంచి రోడ్డు మార్జిన్లకు మరమ్మతులు లేకపోవటం, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మార్జిన్లు కొట్టుకుపోయి బీటీ రోడ్డు మాత్రమే మిగిలింది. ఇది ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలను కలిపే రహదారి కావటంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి నిత్యం భారీ వాహనాలతో పగలు, రాత్రి తేడా లేకుండా మెటల్ తరలిస్తున్నారు. భారీ వాహనాలు ఎదురు వస్తే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్నకార్లు తప్పుకోవటం కష్టంగా మారింది. భారీ వాహనాలు ఈ రోడ్డులో కూడా అతి వేగంగా వెళుతుండటంతో వాహన చోదకులు భయాందోళనలు చెందుతున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంటోంది. ద్విచక్రవాహన చోదకులు పెద్ద వాహనం ఎదురువస్తే మార్జిన్‌లోకి దిగి అదుపుతప్పి కిందపడి గాయాలపాలు అవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నరసాపురం నుంచి తమ్మిలేరు ప్రాజెక్టు రెగ్యులేటర్ వరకు రహదారి మార్జిన్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదం..



ఈ రోడ్డుపై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా ఉంది. సింగిల్ రోడ్డులో మార్జిన్లు కోతకు గురికావటంతో భారీ వాహనాలు అతివేగంగా ఎదురు వస్తే తప్పుకోవటం కష్టంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లకు మరమ్మతులు జరిపించాలి.

-సత్యనారాయణరాజు, పోలవరం, చాట్రాయి మండలం.



పోలవరం-మంకొల్లు మధ్య కోతకు గురైన రోడ్డు మార్జిన్



కైకలూరులో విజేతలకు బహుమతుల పంపిణీ



ముద్దాయికుంటలో విద్యార్థుల ప్రదర్శన



సింగరాయపాలెంలో మొక్కలు నాటుతున్న అధికారులు

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత

కైకలూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొర దెబ్బతినడం వల్ల వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని దానిని కాపాడుకునేందుకు అందరూ ప్రయత్నించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీలత అన్నారు. మంగళవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్‌పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలను ఓజోన్ పొర సంగ్రహించి ప్రాణకోటిని కాపాడుతోందన్నారు. ఇటీవల మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధికశాతం మంది ఏసీలు వినియోగించడం వలన ఓజోన్‌పొర క్షీణిస్తుందన్నారు. 1987లోనే ఈ విషయాన్ని గుర్తించారని ఐక్యరాజ్యసమితి దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా సెప్టెంబరు 16వ తేదిన ఈ దినోత్సవాన్ని జరుపుతారన్నారు. ఓజోన్‌పొరను కాపాడుకునేందుకు చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో భూమిపై మానవజాతి మనుగడ ప్రశ్నార్ధకమవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓజోన్‌పొరపై క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

ముదినేపల్లి: పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏలూరు జిల్లా శాఖ మంగళవారం సింగరాయపాలెం గ్రోవెల్ సీఫుడ్స్ ప్రొసెసింగ్ కంపెనీలో ఓజోన్ డే ఘనంగా నిర్వహించింది. కంపెనీ ఎండి చింతపల్లి సుధీర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లా ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కె వెంకటేశ్వరరావు ఓ జోన్ పొరను పరిక్షించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రొసెసింగ్ యూనిట్ డైరెక్టర్ పొట్లూరి శ్రీనివాస్, హెచ్‌ఆర్‌లు ఎం ప్రతిమకీర్తి తదితరులు పాల్గొన్నారు. పెదగొన్నూరు హైస్కూలు విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కంపెనీ ఆవరణలో మొక్కలు నాటారు.

నూజివీడు: నూజివీడు మండలం ముద్దాయికుంటలోని జడ్పీ హైస్కూలులో ఓజోన్ డే ప్రధానోపాధ్యాయుడు డి.భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ సాంకేతిక నామమైన 03 రూపంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను మానాలని హెచ్‌ఎం సూచించారు.

నేటి నుంచి సేవా పక్షోత్సవాలు

నూజివీడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా నూజివీడు బీజేపీ ఆధ్వర్యంలో సేవాపక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బోను అప్పారావు తెలిపారు. మంగళవారం నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానం, స్వచ్ఛభారత్, మొక్కలు నాటడం, వివిధ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు నిర్వహణకు పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ త్రిసభ్యకమిటీని ఏర్పాటు చేసినట్టు నాగరాణి తెలిపారు. జిల్లా కోశాధికారి మాటూరి రవికాంత్, సీనియర్ నాయకులు వై.ఎస్ దొరై, ఎం.రాజశేఖర్, మాటూరి ప్రసాద్ తదితరులు హాజరు అయ్యారు. అలాగే నూజివీడు నియోజకవర్గ బీజేపీ రూరల్ సమావేశంలో పార్టీ నూజివీడు రూరల్ అధ్యక్షుడు నక్కా నాగశివ, నాయకులు బావరాజు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ముసునూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రేమ జంట సోమవారం రాత్రి ముసునూరు పోలీసులను ఆశ్రయించింది. రమణక్కపేటకు చెందిన చేకూరి అనిల్, చాట్రాయికి చెందిన సవరం జయషాలిని కొంత కాలంగా ప్రేమించుకుంటు న్నారు. వీరి వివాహానికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో 15వ తేదీన రాత్రి వీరు వలసపల్లి అడ్డరోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించారు. వీరు మేజర్లు కావడంతో మంగళవారం వీరి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి యువకుడి వెంట యువతిని పంపినట్లు ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. వీరిని ఎటువంటి ఇబ్బందులకు గురి చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని యువతి కుటుంబీకులను ఎస్‌ఐ హెచ్చరించారు.

చాట్రాయి ఎంపీడీవోగా రాజు

చాట్రాయి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): చాట్రాయి ఎంపీడీవోగా బి రాజును నియమిస్తూ కృష్ణా జడ్పీ సీఈవో కె కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, సీఈవో కన్నమనాయుడు నుంచి రాజు ఉత్తర్వులు అందుకున్నారు. వీరులపాడు ఎంపీడీవోగా పనిచేస్తున్న రాజు ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆగిరిపల్లి ఎంపీడీవో భార్గవి చాట్రాయి ఎంపీడీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 1, 2 రోజుల్లో రాజు ఎంపీడీవోగా బాధ్యతలు చేపడతారని తెలిసింది.

చెత్త సేకరణ సక్రమంగా జరగాలి

ముసునూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నూజివీడు డీఎల్‌డీవో వెంకటరత్నం అన్నారు. మంగళవారం గోపవరంలో చెత్త సేకరణను తనిఖీ చేసి మాట్లాడుతూ సంపద కేంద్రాల నిర్వహణ సమర్థ వంతంగా జరగాలన్నారు. స్వచ్ఛ గ్రామాల సాధనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, శ్రీనివాస చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి ఐటీఐ కళాశాల విద్యార్థుల విరాళం

ముదినేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని నిర్మాణానికి తమ వంతు సహకారంగా ప్రతి ఒక్కరు రూ. 116లు విరాళంగా అందించాలన్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి పిలుపు మేరకు ముదినేపల్లి ఏపీ ఏఎంఐటీఐ కళాశాల విద్యార్థులు స్పందించారు. మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 140 మంది విద్యార్థులు, పది మంది సిబ్బంది తమ వంతు విరాళంగా సుమారు రూ.20 వేలు ఏపీసీఆర్‌డీఏ బ్యాంక్ ఖాతాకు క్యూఆర్ కోడ్ ద్వారా పంపించారు. వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హరిత పాల్గొన్నారు.

‘ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలి’

చాట్రాయి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాలతో కుదేలైన ఆక్వా రంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి హరనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని అమెరికాయేతర దేశాలకు ఆక్వా ఎగుమతులకు ఒప్పందాలు చేసుకోవాలని కోరారు. దేశంలో వివిధ ప్రాంతాలకు ఆక్వా ఉత్పత్తులు రవాణాకు ప్రత్యేక రైళ్ళు నడపాలని విజ్ఞప్తి చేశారు.

మహిళల ఆరోగ్యానికి జై

మహిళల ఆరోగ్య పరిరక్షణకు ‘స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్’

నిడమర్రు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో మహిళ బాగుంటే ఆ కుటుంబం అంతా బాగుంటుందనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం తెలిపారు. ఇందులో భాగంగా 548 క్యాంపులు నిర్వహిస్తున్నామని, ఈ క్యాంపులు ద్వారా చంటి పిల్లలకు టీకాలు మొదలు యుక్త వయస్సు బాలికలకు రక్తహీనతా పరీక్షలు, మహిళలకు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని, గర్భిణులకు వైద్య సదుపాయంతో పాటు పోషకాహార ప్రాధాన్యతను తెలియజేస్తామన్నారు.

నేటి నుంచి వైద్య శిబిరాలు

ముసునూరు: ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ షకీనా ఇవాంజలి, డాక్టర్ ఎస్.రమ్య తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 17న గోపవరం-1, చెక్కపల్లి, 18న సూరేపల్లి, 19న కాట్రేనిపాడు, 20న వేల్పుచర్ల, లోపూడి, 22న ముసునూరు-2, 23న ముసునూరు-1, 24న గుళ్ళపూడి, 25న గోపవరం-2, 26న రమణక్కపేట, 27న చింతలవల్లి, 29న బలివే, అక్కిరెడ్డిగూడెం, అక్టోబరు 1వ తేదీన కొర్లకుంట, వలసపల్లి గ్రామాల్లోని ఆరోగ్యకేంద్రాల వద్ద వైద్యశిబిరాలు జరుగుతాయన్నారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని, ఈ వైద్యశిబిరాలను మండలంలోని మహిళలు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

చాట్రాయి: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ పథకం కింద నేటి నుంచి మండలంలో నిర్వహించనున్న వైద్య శిబిరాల షెడ్యూల్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దుర్గాప్రసాద్ తెలియజేశారు. 17న చీపురుగూడెం, 18న పీహెచ్‌సీ చాట్రాయి, చనుబండ-2, 19న చిత్తపూరు-2, 20న నరసింహారావుపాలెం, 22న పోలవరం, చనుబండ-1, 23న చిత్తపూరు-1, పోతనపల్లి, 24న బూరుగుగూడెం, 25న జనార్ధనవరం, 26 చిన్నంపేట, 27 కోటపాడు, 29 తుమ్మగూడెం లలో వైద్య శిబిరాలు జరుగుతాయని వివరించారు. మహిళలు బాలికలు పిల్లలు ప్రజలు ఈ శిబిరాలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హత్య కేసులో నాలుగేళ్ల జైలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ తస్కరించాడని ప్రశ్నించిన వ్యక్తిని కర్ర తో చావబాదడంతో ఆ వ్యక్తి మృతి చెందాడు. దీంతో కొట్టిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధి స్తూ ఏలూరులోని 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కామ వరపుకోట మండలం రావికంపాడు గ్రామానికి చెందిన ఇస్సాకు 2024 జులై 4వ తేదీ రాత్రి ఆ గ్రామ రామాలయం ఎదురుగా ఉన్న మండపం లో మద్యం మత్తులో పడుకున్నాడు. అదే సమ యంలో గ్రామానికి చెందిన మద్దిపట్ల నాగేశ్వర రావు అలియాస్ అబ్బులు(58) వచ్చి అక్కడే ఉన్నాడు. ఇస్సాకు సెల్‌ఫోన్ కనిపించక పోవడంతో అబ్బులు తీశాడని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన అబ్బులు కర్రతో చితకబాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అప్పటి తడికల పూడి ఎస్‌ఐ జయబాబు కేసు నమోదు చేసి మద్దిపట్ల నాగేశ్వరరావును అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. ప్రాసిక్యూషన్ తర పున ఏపీపీలు డి.వి.రామాంజనేయులు, చింత మనేని రమేశ్‌లు వాదించారు. ప్రాసిక్యూషన్‌కు కోర్టు మానిటరింగ్ సెల్ హెచ్.సి. కెఎస్ఎన్. మూర్తి, ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఏఎస్‌ఐ సిసిలి,ఏఎస్‌ఐ రుక్మంగధరావు, జంగారెడ్డిగూడెం సీఐ ఎం.వి.శుభాశ్, తడికలపూడి ఎస్‌ఐ చెన్నారావు, కోర్టు హెచ్.సి. రఫీలు సహకరించారు.

మద్యం మత్తులో కాల్వలో పడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కాల్వలో పడి ఒకరు మృతి చెందారు. ఏలూరు రూరల్ పరిధిలోని గ్రీన్ సిటీ ప్రాంతానికి చెందిన కోట్ల ప్రసాద్(48) మద్యా నికి బానిసవడంతో వివాహం చేసుకోకుండా ఒంటరిగా ఉండిపోయాడు. మంగళవారం మధ్యాహ్నం మద్యం తాగి పడమరలాకుల వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయాడు. అతడి మృత దే హం కొత్తూరు జూట్‌మిల్లు వద్ద లభించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రూరల్ పోలీసులు స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



సత్యనారాయణ (ఫైల్)

చాట్రాయి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోకి మంకొల్లు గ్రామానికి చెందిన మత్స్యకారుడు వీరబోయన సత్యనారాయణ(50) తమ్మిలేరు ప్రాజెక్టులోకి చేపలవేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు నీటి మునిగి మంగళవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం మత్స్యకారుడు సత్యనారాయణ సోమవారం రాత్రి తమ్మిలేరు ప్రాజెక్టులోని గోనెలవాగు బేసిన్‌లోకి చేపలవేటకు వెళ్ళాడు. అతను ఇంటికి రాకపోవటంతో కుటుంబీకులు గ్రామస్థులు వెదుకుతుండగా మంగళవారం సాయంత్రం లింక్ ఛానల్ వద్ద సత్యనారాయణ మృతదేహం కన్పించింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని లింక్ ఛానల్ నుండి బయటకు తీయించి, పోస్టుమార్టంకు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి పంపారు.

విద్యార్థిని అదృశ్యం

ముదినేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వైవాక గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున డిగ్రీ చదువుతున్న ఓ యువతి అదృశ్యమైంది. ఆ గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి ఏలూరులో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతూ సోమవారం వైవాక ఇంటికి వచ్చింది. రాత్రి అందరూ కలసి నిద్రించారు. మంగళవారం వేకువ జామున చూడగా ఆ యువతి కనిపించలేదు. బంధువుల ఇళ్ళ వద్ద ఆరా తీసినా ఆ యువతి ఆచూకీ తెలియలేదు. దీనిపై తండ్రి మంగళవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెచ్‌సి ఎస్‌వి రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చర్చిద్దాం రండి

(5వ పేజీ తరువాయి)

వైసీపీ పాలనలో రూ.125 కోట్లు ఖర్చు పెట్టారు. కూటమి ప్రభుత్వం రూ.80 కోట్లు ఖర్చుపెట్టి పనులు వేగవంతం చేస్తోంది. ఇంకా రూ.325 కోట్లతో భవన నిర్మాణాలు చేపట్టాల్సి వుంది. ఈ పనులన్ని ఏడాదిన్నరలో పూర్తవుతాయి. తమ ప్రభుత్వం వచ్చాకే అన్ని సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఏటిగట్టు ప్రాంతంలో ఎకరం 50 సెంట్లు, సాంఘిక సంక్షేమ హాస్టల్స్ భవనాల ప్రాంతం ఎకరం 12 సెంట్లు భూమిని వైద్య కళాశాలకు అప్పగిస్తూ చర్యలు తీసుకున్నాం. ఆ భవనాల్లో హాస్టల్స్ నిర్మిస్తాం. వైసీపీ నాయకులు సిగ్గు ఎగ్గు లేకుండా ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల అన్ని సదుపాయాలతో తామే నిర్మించామంటూ తాత్కాలిక భవనం వద్ద కేక్ కట్ చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేతోపాటు ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, కో ఆప్షన్ మెంబర్ చోడే వెంకటరత్నం, బెల్లంకొండ కిశోర్, నెర్సు గంగరాజు, పూజారి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475